

వెంకటాచలం టోల్‌ప్లాజా వద్ద ఏర్పాటు చేసిన పోలీసు చెక్‌పోస్టు



ఎన్నికలకు పోలీసుల సన్నద్ధం

- ప్రారంభమయిన సీఐ, ఎస్‌ఐల బదిలీలు
- వాహనాల తనిఖీలు షురూ
- ఆయుధాల డిపాజిట్‌కు ఆదేశాలు
- రౌడీషీటర్ల బైండోవర్, కదలికలపై నిఘా
- గత ఎన్నికల్లో కేసులు నమోదయిన వారిపై ప్రత్యేక దృష్టి
- ఐదుగురు సభ్యులతో ఎలక్షన్ సెల్

నెల్లూరు(క్రైం),జనవరి 24: త్వరలో జరగనున్న ఎన్నికల సంగ్రామానికి పోలీసు శాఖ సన్నద్ధమవుతోంది. ఈ క్రమంలో ఎస్‌ఐలు, సీఐలు బదిలీలు జరిగాయి. అంతేకాక సీఐ, ఎస్‌ఐ, ముగ్గురు కానిస్టేబుళ్లతో ఎలక్షన్ సెల్‌ను కూడా జిల్లా ఎస్పీ డాక్టర్ కె తిరుమలేశ్వరరెడ్డి ఏర్పాటు చేశారు. ఈ నెల 23న జరిగిన జిల్లా క్రైమ్ సమావేశంలో ఎన్నికలకు సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చేపట్టాల్సిన ప్రణాళికలు, గ్రామ సమావేశాలు తదితర అంశాలపై ఎస్పీ అధికారులకు, సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఎన్నికల కమిషన్ షెడ్యూల్ ఇంకా ప్రకటించక పోయినా ఏప్రిల్ మూడవ వారంలో ఎన్నికలు జరుగుతాయని అంటున్నారు. ఈ క్రమంలో జిల్లా పోలీసుశాఖ ప్రశాంత ఎన్నికలకు ముందస్తు చర్యలు చేపట్టింది.

● బదిలీల ప్రారంభం

ఇప్పటికే జిల్లాలో పలువురు సీఐలతోపాటు స్థానికంగా ఉన్న 17 మంది ర్యాంకర్ ఎస్‌ఐలను బదిలీ చేశారు. ఇతర జిల్లాల నుంచి పలువురు సీఐలు, 17 మంది ఎస్‌ఐలను జిల్లాకు కేటాయించారు. ఇంకా జిల్లాలో ఉన్న డీఎస్పీలు, సీఐలు కూడా ఎన్నికల నేపథ్యంలో బదిలీ అయ్యే అవకాశాలు కన్పిస్తున్నాయి.

● వాహనాల తనిఖీలు

జిల్లావ్యాప్తంగా ఆయా పోలీసుస్టేషన్ల పరిధిలో చెక్ పోస్టులను ఏర్పాటు చేసి ముమ్మరంగా వాహనాల తనిఖీలు చేస్తున్నారు. లారీలు, బస్సులు, కార్లతోపాటు ద్విచక్ర వాహనాలను సైతం క్షుణ్ణంగా తనిఖీలు చేస్తున్నారు. ప్రధానంగా జిల్లా సరిహద్దులు, టోల్‌ప్లాజాలు, జాతీయ రహదారులపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు.

● బైండోవర్ల ప్రారంభం

జిల్లావ్యాప్తంగా 1,068 మంది రౌడీషీటర్లను బైండోవర్ చేసుకున్నారు. గత ఎన్నికల్లో నేరాలకు పాల్పడినవారిపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. ఎన్నికల నేపథ్యంలో వారు చేసే ప్రతి పనిని గమనిస్తున్నారు. గ్రామసభలు ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. జిల్లాలో ఉన్న 400కు పైగా ఉన్న లైసెన్స్‌డ్ ఆయుధాలను డిపాజిట్ చేయాలని ఇప్పటికే పోలీసు అధికారులు నోటీసులు అందజేశారు. వాటిని డిపాజిట్ చేసుకునే ప్రక్రియను కూడా ప్రారంభించారు.

సీఐలు, ఎస్‌ఐల బదిలీ

సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా గుంటూరు రేంజ్ పరిధిలోని సీఐలను, ఎస్‌ఐలను బదిలీ చేస్తూ ఐజీ జీ పాలరాజు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో భాగంగా రేంజ్ వీఆర్‌లో ఉన్న బీ నాగభూషణంను కావలి రూరల్ సీఐగా నియమించారు. అక్కడ పనిచేస్తున్న కాటూరి శ్రీనివాసరావును కావలి రూరల్ అప్‌గ్రేడ్ పోలీసు స్టేషన్‌కు బదిలీ చేశారు.

● జిల్లా నుంచి వెళ్లినవారు

జిల్లాలో విధులు నిర్వహిస్తున్న ఎస్‌ఐలు కే వేణుగోపాల్, జీ అంకమ్మ, సీహెచ్ వాసు, కే లేఖా ప్రియాంక, ఎం రాజకుమార్, ఆర్ స్వామిశ్రీనివాస్, షేక్ కరీముల్లా గుంటూరు జిల్లాకు, ఎం వెంకటరావు, కే సుమన్, ఏ శశికుమార్, ఎం ఆంజనేయులు, ఎస్ సుమన్‌లు పల్నాడు జిల్లాకు, షేక్ సుభానీ బాపట్ల జిల్లాకు బదిలీ అయ్యారు.

● జిల్లాకు వచ్చినవారు


గుంటూరు జిల్లా నుంచి టీ భవాని, జీ ఏడుకొండలు, ఎన్ నరహరి, ఎం శివనాంచారయ్య, పల్నాడు జిల్లా నుంచి షేక్ రహంతుల్లా, డీ కిశోర్‌బాబు, వీ సుబ్బారావు, ఎం రాజ, బాపట్ల జిల్లా నుంచి కే అహ్మద్‌జాని, జీ కిరణ్‌బాబు, డీ రామకృష్ణ, సీహెచ్ చంద్రావతి, జీ అరుణజ్యోతిలు నెల్లూరుజిల్లాకు వచ్చారు.



పోలింగ్ కేంద్రం 209లో 63, 64 సీరియల్ నెంబరులో ఉన్న తల్లి, కుమార్తె ఓట్లు

ఒకే కుటుంబం ఓట్లు వేర్వేరు సీరియల్ నెంబర్లలో..

సంగం, జనవరి 24: కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసిన తుది ఓటర్ల జాబితాలోనూ యథావిధిగా తప్పులు దొర్లాయి. ఒక కుటుంబంలోని ఓట్లు ఒకేచోటే ఉండాలని ఎన్నికల సంఘం ఆదేశించినా, వేర్వేరు సీరియల్ నెంబర్లలో ఉన్నాయి. ఇంటి నెంబరు ఇంటి యజమాని ఒక సీరియల్ నెంబరులో ఉంటే మిగతా సభ్యుల ఓట్లు మరో సీరియల్ నెంబరులో ఉన్నాయి. అందుకు ఉదాహరణ సంగంలోని 209 పోలింగ్ కేంద్రంలో కోరిమెర్ల శ్రీనివాస చౌదరి ఇంటి నెంబరు 2-12, ఆయన ఓటు 565 సీరియల్ నెంబరులో ఉంది. ఆయన సతీమణి కోరిమెర్ల మంజుల 63, కుమార్తె పద్మావతి 64 సీరియల్ నెంబరులో ఉన్నాయి. కుటుంబంలోని ముగ్గురికి ఒకే ఇంటి నెంబరు ఉన్నా వేర్వేరు సీరియల్ నెంబరులో ప్రచురించి ఉండటం గమనార్హం



అదే పోలింగ్ కేంద్రంలో 565 సీరియల్ నెంబరులో ఉన్న కొరిమెర్ల శ్రీనివాస చౌదరి ఓటు

వరికుంటపాడు తహసీల్దారు సస్పెన్షన్

- విధి నిర్వహణలో నిర్లక్ష్యంతోనే...
- రాజకీయ పరిణామాల నేపథ్యంలో గతంలోనూ ఇద్దరి తొలగింపు

వరికుంటపాడు, జనవరి 24: వరికుంటపాడు తహసీల్దారు ఎన్. మల్లికార్జునరావును విధుల నుంచి తొలగిస్తూ ఉన్నతాధికారులు బుధవారం ఉత్తర్వులను జారీ చేశారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించినందుకు ఆయనపై వేటు వేసినట్లు జేసీ కూర్మనాథ్ జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. గతంలో ఉన్న తహసీల్దారు బదిలీ కావడంతో ఆయన స్థానంలో డీటీ మల్లికార్జురావుకు బాధ్యతలు అప్పగించారు. బాధ్యతలు చేపట్టిన అనతికాలంలోనే సస్పెన్షన్‌కు గురికావడం ఉద్యోగుల్లోనూ, ప్రజల్లోనూ చర్చనీయాంశంగా మారింది. ఇటీవల చోటు చేసుకున్న పరిణామాల నేపథ్యంలోనే ఆయన సస్పెన్షన్‌కు గురైనట్లు ఆరోపణలు విన్పిస్తున్నాయి. ప్రధానంగా భూ పంపిణీకి సంబంధించి తాము రూపొందిన జాబితాలను అసైన్‌మెంట్ కమిటీ ఆమోదం కోసం ఉన్నతాధికారులకు అందజేయాలని అధికారపార్టీ నేతల నుంచి ఒత్తిడి పెరిగింది. అందుకు ఆయన ససేమిరా అన్నారు. ఈ క్రమంలో కక్ష సాధింపు చర్యలతోనే ఈ పరిస్థితి నెలకొందని పలువురు అంటున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల ఆంధ్రజ్యోతిలో 'పొజిషన్ సర్టిఫికెట్ ఇస్తారా.. చచ్చిపొమ్మంటారా,' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. ఇది కూడా ఆయన తొలగింపునకు కారణమైంది. అయితే గతంలో తహసీల్దార్లుగా పనిచేసిన జాన్‌ప్రభాకర్, మునిరాజులు సైతం రాజకీయ పరిణామాల నేపథ్యంలో సస్పెన్షన్‌కు గురయ్యారని తెలిసింది.



మల్లికార్జునరావు

నగరం.. నరకమే!



మినీ బైపాస్‌లో నిరుపయోగంగా పార్కు



శిథిలావస్థలో రోడ్లు శుభ్రపరిచే బ్రషింగ్ వాహనం

నెల్లూరు నగరం అభివృద్ధి పనులతో చిరునవ్వులు చిందిస్తుందని పాలక పక్షం చంకలు గుద్దుకోవడం తప్ప వాస్తవ పరిస్థితి అందుకు పూర్తి భిన్నంగా ఉంది. గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధి అంటే ఎలా ఉంటుందో చవిచూసిన నగరవాసులు గడిచిన నాలుగున్నరేళ్లలో కనీస వసతులకు నోచుకోక నరకయాతన అనుభవిస్తున్నారు. ఒక్కమాటలో చెప్పాలంటే రాజకీయ కక్షల కారణంగా అర్ధంతరంగా ఆగిన భారీ పథకాలు, జన ప్రయోజనాల చేసిన అభివృద్ధి పనులు ఎందుకు కొరగాకుండా మూలనపడిపోయాయి. నిరుపేదలకు సొంతింటి కల కలగానే మిగిలిపోయింది. ప్రభుత్వ కాలేజీల్లో ఉచిత విద్య అవకాశం విద్యార్థులకు దూరమయ్యింది.

- నెల్లూరు (ఆంధ్రజ్యోతి)

- అభివృద్ధి కానరాక ఉసూరుమంటున్న సింహపురి
- నాలుగున్నరేళ్లుగా కానరాని ప్రగతి

ఆంధ్రజ్యోతి పరిశీలన

చుట్టపు చూపుగా నెల్లూరు నగరానికి వచ్చిన వారి నెవరినైనా నెల్లూరు దేనికి ఫేమస్ అని అడిగితే దోమలకు ప్రసిద్ధి అని చెప్పే పరిస్థితి ఏర్పడింది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో సుమారు రూ.1600 కోట్లతో భూగర్భ డ్రైనేజీ పనులు, డ్రింకింగ్ వాటర్ స్కీమ్ చేపట్టింది. పనులు ప్రారంభించిన రెండేళ్లలోనే 90 శాతానికిపైగా పూర్తి చేశారు. అయితే ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఆ పథకాలను ఉద్దేశపూర్వకంగానే పక్కన పడేసింది. నాలుగున్నరేళ్ల కాలం పూర్తి కావస్తున్నా ఇప్పటివరకు మిగిలిన అరాకొర పనులు పూర్తి చేసిన దాఖలాలు లేవు.

నిలువ నీడ దొరకని పేదలు

నిరుపేదలకు టీడీపీ హయాంలో నిర్మించిన బహుళ అంతస్తుల భవనాలను నాలుగేళ్లపాటు పేదలకు పంచకుండా నిరుపయోగంగా పెట్టారు. దొంగలు ఆ ఇళ్ల తలుపులు, కిటికీలు, ఎలక్ట్రికల్ వైరింగ్ సామాన్లు దొంగలించుకుపోయిన తరువాత తీరుబాటుగా మూడు నెలల క్రితం పేదలకు కేటాయించారు. దొంగల భయానికి చాలా మంది ఆ ఇళ్లలో చేరడానికి వెనుకాడుతుండగా, ఎలా గోలా బతికేద్దామని ఇళ్లలో చేరిన పేదలు తాగునీరు అందక అల్లాడుతున్నారు. ప్రతి మున్సిపల్ సమావేశంలో ఆ డివిజన్ కార్పొరేటర్ ఈ బాధలను వెల్ల గక్కుతున్నా పరిస్థితిలో మాత్రం మార్పు లేదు.

జగనన్న ఇళ్ల లబ్ధిదారుల గోడు

జానెడు జాగా అయినా చాల్లే ఎలాగోలా సర్దుకుందాం అని జగనన్న ఇళ్ల కోసం ఆశపడిన పేదలకు ఇల్లు లేక పోగా ఒక్కొక్కరి ఖాతాలో లక్ష రూపాయల అప్పు మిగిలింది. జగనన్న లే అవుట్‌లో అధికార పార్టీ నాయకులు ఇళ్లు నిర్మించి ఇచ్చే బాధ్యత ఓ కాంట్రాక్టర్‌కు అప్పగించారు. ఆయన హౌసింగ్ అధికారులను మేనేజ్ చేసుకొని పునాదులు కూడా తీయకుండానే మొత్తం బిల్లు తీసుకొని తినేసి చేతులెత్తేశారు. వెంకటేశ్వరపురం లే అవుట్‌లో 1700 మంది లబ్ధిదారుల పేర్ల మీద పునాదులు కూడా పూర్తిగా వేయకుండానే ఒక్కో ఇంటిపై 70వేల బిల్లు డ్రా చేసుకున్నాడు. అంతేకాదు పునాదుల దశలోనే మోల్డింగ్ కోసం ఇచ్చే స్టీలు, సిమెంట్ పూర్తిగా డ్రా చేసుకున్నాడు. ఇది చాలదన్నట్టు మాయ మాటలు చెప్పి ఒక్కో లబ్ధిదారుడి నుంచి రూ.10 వేల నుంచి 20వేల వరకు వసూలు చేసుకున్నాడు. మొత్తం 3 కోట్ల రూపాయలు తినేసి చేతులెత్తేశాడు. ఇక వెంకటేశ్వరపురం పరిధిలోని పెన్నా పరివాహక ప్రాంతాల్లో ప్రజల ప్రాణభయం ఇప్పటికీ తగ్గలేదు. పెన్నా నదికి సోమశిల నీరు వదిలారంటే ఈ ప్రాంత ప్రజలకు కంటిమీద కునుకు ఉండటం లేదు. పెన్నా పరివాహక ప్రాంతాలపైకి వరద నీరు రాకుండా పొర్లు కట్టల నిర్మాణానికి సీఎం జగన్ ఇచ్చిన హామీకి మూడేళ్లు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి పునాది రాయి వేసి రెండున్నరేళ్లు అవుతోంది. కానీ ఇప్పటివరకు నిర్మాణంలో పురోగతి లేదు.



రాజరాజేశ్వరి ఆలయం వద్ద నిరుపయోగంగా ఉన్న ఏసీ బస్టాప్

మూలకు స్వచ్ఛాంధ్ర మిషన్లు

మున్సిపల్ మంత్రి హోదాలో నారాయణ స్వచ్ఛాంధ్ర మిషన్ పైలెట్ ప్రాజెక్టు కింద నెల్లూరు నగరంలో చెత్త శుభ్రం చేయడానికి అధునా తన భారీ యంత్రాలు తీసుకొచ్చారు. రెండేళ్లపాటు ఈ భారీ యంత్రాలు నగర శుభ్రతకు వినియోగించారు. ప్రభుత్వం మారడంతో వీటిని మూలన పడేశారు. వీటిని ఉపయోగంలోకి తెస్తే ప్రజలకు గత పాలకులు గుర్తుకు వస్తారను కున్నారో ఏమో అధికారులు వీటి వినియోగంలోకి తేవడానికే ఆసక్తి చూపడం లేదు.



కాంట్రాక్టర్ డబ్బులు తినేయడంతో అర్ధంతరంగా ఆగిన వెంకటేశ్వరపురంలోని జగనన్న కాలనీ ఇళ్లు

రోడ్ల పరిస్థితి దారుణం

నగర పరిధిలో ప్రధాన రహదారుల నుంచి చిన్న రోడ్ల వరకు అత్యంత దారుణంగా తయారయ్యాయి. ఎన్నికల సమయం సమీపిస్తుండటంతో ఇప్పుడిప్పుడు అక్కడక్కడా రోడ్లు వేస్తున్నారు. ఇంకా అత్యధిక శాతం రోడ్లు నడక సాగించడానికి కూడా సాధ్యపడనంత దారుణంగా ఉన్నాయి. ప్రధానంగా వర్షం కురిస్తే ప్రజలకు ప్రత్యక్ష నరకం కని పిస్తోంది.

కరువైన ఉచిత డిగ్రీ విద్య

దశాబ్దాల చరిత్ర కలిగిన వీఆర్‌సీ, సర్వోదయా, ఎస్వీజీఎస్ (ఎయిడెడ్) కళాశాలలు కూడా పూర్తిగా మూసి వేయడంతో విద్యార్థులు ప్రైవేట్ కళాశాలల్లోనే చేరాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. నగరంలో డిగ్రీ కళాశాలగా కీర్తి గడించిన వీఆర్‌సీలో ఎంతో మంది ప్రముఖులు విద్యనభ్యసించి నేడు అత్యున్నత స్థానాల్లో రాణిస్తున్నారు. అంతటి చరిత్ర కలిగిన వీఆర్‌సీ 2021 నుంచి మూసివేశారు. అదే ఏడాది సర్వోదయా, ఎస్వీజీఎస్ కళాశాలలను కూడా ఈ ప్రభుత్వం మూసే సింది. దీంతో వేలాది మంది పేద విద్యార్థులు ప్రైవేటు కాలేజీల్లో ఏటా వేల రూపాయల ఫీజు కట్టి చదవలేక డిగ్రీ చదువుకు స్వస్తి చెప్పాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఎస్వీజీఎస్ మైదానంలో టీడీపీ రా.. కదలిరా!

- పార్టీ అధినేత చంద్రబాబు రాక
- ఏర్పాట్లు పరిశీలించిన నాయకులు



మైదానాన్ని పరిశీలించి సూచనలిస్తున్న సోమిరెడ్డి

నెల్లూరు (వైద్యం), జనవరి 24 : నెల్లూరు నగరంలోని శ్రీ వేణుగోపాల్‌స్వామి కళాశాల మైదానాన్ని టీడీపీ నేతలు బుధవారం పరిశీలించారు. ఈ నెల 28వ తేదీన రా.. కదిలిరా సభ ఆ మైదానంలో నిర్వహించనున్న సందర్భంగా అక్కడ ఏర్పాట్లను పరిశీలించి నాయకులకు పలు సూచనలు చేశారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నందున నిర్వహణలో లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర, నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తదితరులు మైదానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ ఈ నెల 28న ఉదయం 10 గంటలకు సభ ప్రారంభమవుతుందన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు సభలు ఒక ప్రభంజనంలా జరిగా యని, అదే రీతిలో ఇక్కడ కూడా జరుగుతుందని తెలిపారు. రాబోయే రోజుల్లో చంద్రబాబు, పవన్ కల్యాణ్ కలిసి సభలు నిర్వహిస్తారన్నారు. అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ మొదటి కోవూరులో సభ నిర్వహించాలని భావించామని, అయితే అనువైన స్థలం దొరకక పోవటంతో నెలూరులోని ఎస్వీజీఎస్ కళాశాల మైదానంలో చేపడుతున్నామని వెల్లడించారు. చంద్రబాబు సభలకు స్థలాలిచ్చే వారిని వైసీపీ నేతలు ఒత్తిళ్లకు గురి చేస్తున్నారన్నారు, ఇలాంటి జులుం పనులు ఎన్నో రోజులు సాగవని హెచ్చరించారు, ఈ కార్యక్రమంలో కావలి, కోవూరు నియోజకవర్గాల టీడీపీ ఇన్‌చార్జులు మాలేపాటి సుబ్బానాయుడు, పోలంరెడ్డి దినేష్‌రెడ్డి, జడ్పీ మాజీ ఛైర్మన్ చెంచలబాబు యాదవ్, నెల్లూరు మున్సిపల్ మాజీ ఛైర్‌పర్సన్ తాళ్లపాక అనూరాధ, నాయకులు జెన్ని రమణయ్య, బొమ్మి సురేంద్ర, పమిడి రవికుమార్‌చౌదరి, మలిశెట్టి వెంకటేశ్వర్లు, రాజానాయుడు, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి, నన్నేసాహెబ్, రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలుంటే వాట్సాప్‌కు పంపండి

- ఎస్ఈ విజయన్



మాట్లాడుతున్న ఎస్ఈ విజయన్

నెల్లూరు (జడ్పీ), జనవరి 24 : జిల్లాలో ఎక్కడైనా విద్యుత్ సమస్యలుంటే ఫొటోలు తీసి సెల్‌ఫోన్ వాట్సాప్‌కు పంపాలని విద్యుత్‌శాఖ ఎస్ఈ విజయన్ వినియోగదారులను కోరారు. నగర డివిజన్‌కు సంబంధించి విద్యుత్ భవన్‌లో ఆయన బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. నగరంతోపాటు జిల్లాలో సమస్యలు ఏర్పడితే 9133331912 ఫోన్ నెంబరుకు వాట్సాప్ ద్వారా ఫొటోలు పంపిస్తే ఆ సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు అధికారులు కృషి చేస్తారని తెలిపారు. రాబోవు వేసవిలో విద్యుత్ వినియోగం భారీగా పెరిగే అవకాశం ఉన్నందున నగర డివిజన్ అధికారులు, ప్రత్యేక ప్రణాళికలు తయారు చేసుకోవాలని సూచించారు. సరఫరాలో అంతరాయం కలుగకుండా పటిష్ట చర్యలు ఉండాలన్నారు. పనులు చేసే సమయంలో అంతరాయాల వివరాలను ఉజ్రామిత్రా యాప్‌లో పొందుపరచాలని, దీంతో వినియోగదారులకు ముందుగానే సమాచారం అందుతుందని తెలిపారు. ఈ సమావేశంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సోమశేఖర్‌రెడ్డి, డిప్యూటీ ఈఈలు శ్రీధర్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో లైన్‌మన్ మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

సైదాపురం, జనవరి 24: విద్యుదాఘాతంతో లైన్‌మన్ మృతి చెందిన సంఘటన మండలంలోని వేములచేడు గ్రామ పొలాల్లో బుధవారం చోటుచేసు కుంది. ఎస్ఐ చల్లా వాసు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సైదాపురంకు చెందిన లైన్‌మన్ చెంజి శ్రీనివాసులు(42) వేముల చేడు పొలాల్లో రైతు మోటార్లకు విద్యు త్ కనెక్షన్ ఇచ్చి ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగిలి మృతిచెందాడు. దీంతో కేసు నమోదుచేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	115
లేయర్ లైవ్	85
స్కిన్ చికెన్	210
స్కిన్‌లెస్	230
లేయర్	145

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 5956
వెండి కిలో ధర	రూ. 73,000
వెండి ఒక గ్రాము	రూ. 75.00

అనుమానాస్పద స్థితిలో గుర్తుతెలియని వ్యక్తి మృతి



మృతిచెందిన గుర్తుతెలియని వ్యక్తి

మనుబోలు, జనవరి 24: మనుబోలు జాతీయ రహదారి పక్కన పెట్రోలు బంకు వద్ద గుర్తుతెలియని వ్యక్తి (37) అనుమానాస్పద స్థితిలో బుధవారం మృతిచెందాడు. కొంతకాలంగా జాతీయరహదారిపై తిరుగుతూ దుకాణాల వద్ద యాచిస్తుండేవాడు. ఏకారణం చేత చనిపోయాడో తెలియడం లేదు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. శవపరీక్షల నిమిత్తం మృతదేహాన్ని గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు.

ఉపాధ్యాయులకు అవగాహన కార్యక్రమం



మాట్లాడుతున్న డిప్యూటీ ఈవో ప్రసన్నలక్ష్మి

నెల్లూరు (విద్య), జనవరి 24 : స్మైల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నెల్లూరులోని ఓ హోటల్‌లో బుధవారం పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు ఎక్స్‌ప్లోరర్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అతిథిగా హాజరైన డిప్యూటీ విద్యాశాఖాధికారి ప్రసన్నలక్ష్మి మాట్లాడుతూ ఏడాదిన్నరకాలంగా విద్యార్థులకు ఉపయోగపడే విధంగా స్టెమ్ ఎడ్యుకేషన్‌కి సంబంధించి ఫౌండేషన్ సహకారం అందిస్తోందని తెలిపారు. సైన్స్ ఎగ్జిబిషన్‌కు అవసరమైన సామగ్రిని అందచేస్తూ పిల్లల్లో విజ్ఞాన మేధోశక్తిని పెంచేలా చేయాతనందించడం అభినందనీయమన్నారు. ఎస్ఎస్ఏ అకడమిక్ మానిటరింగ్ అధికారి సుధీర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోని ఆరు, ఏడు, ఎనిమిది తరగతుల పిల్లలకు అందిస్తున్న ఎక్స్‌ప్లోరర్స్ కార్యక్రమం ద్వారా పిల్లల్లో కొత్తరకం ఆలోచనలు, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు సాధించేలా వారిని ప్రోత్సహిస్తున్నారన్నారు. అనంతరం కార్యక్రమం గురించి ఉపాధ్యాయులకు అవగాహ న కలిగించడంతో పాటు వారి సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాసులు, స్మైల్ ఫౌండేషన్ కార్యనిర్వహణాధికారి కిషోర్, కోఆర్డినేటర్ విజయ సారథి, సిబ్బంది పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలపై ప్రాథమిక విచారణ

నెల్లూరు(వ్యవసాయం), జనవరి 24 : మనుబోలు మండలం చెర్లోపల్లి గ్రామానికి చెందిన రైతులు కొనుగోలు చేసిన విత్తనాలు నకిలీవంటూ వచ్చిన ఫిర్యాదులపై ప్రాథమిక విచారణ చేపట్టినట్లు జిల్లా వ్యవసాయాధికారి పీ సత్యవాణి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నెల్లూరుకు చెందిన కావేరి సీడ్స్ వద్ద శ్రీ శివనందిని ట్రేడర్స్ కంపెనీకి చెందిన బీపీటీ 5204 వరి రకాన్ని 51 బస్తాలు కొని నారుపోసి నాటినట్లు మండల వ్యవసాయాధికారి ప్రాథమిక విచారణలో తెలిసిందన్నారు. 70 రోజులకు రావాల్సిన కంకులు 50 రోజులకే రావడం వల్ల దిగుబడి తగ్గి నష్టపోవడం జరుగుతుందని తెలిపారు. ప్రాథమిక విచారణ అనంతరం పంట రకాన్ని దిగుబడి అంచనాలకు తిరుపతి వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తలకు కేటాయించిన ట్లు పేర్కొన్నారు. వారి నివేదికల ఆధారంగా చర్యలు తీసుకుంటామని, నష్టపోయిన రైతులకు చట ప్రకారం న్యాయం చేస్తామని తెలిపారు.

27న పీసీసీ చీఫ్ షర్మిల రాక

- కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చేవూరు



మాట్లాడుతున్న దేవకుమార్‌రెడ్డి

నెల్లూరు (వైద్యం), జనవరి 24 : కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల ఈ నెల 27వ తేదీన నెల్లూరుకు వస్తున్నారని డీసీసీ అధ్యక్షుడు చేవూరు దేవకుమార్ రెడ్డి తెలిపారు. ఆమెకు ఘనంగా స్వాగతం పలకాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. బుధవారం నెల్లూరులోని ఇందిరాభవన్‌లో జిల్లాలోని అన్ని నియోజకవర్గాల ఇన్‌చార్జులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, మండల అధ్యక్షులు, సమన్వయకమిటీ నేతలతో ఆయన సమీక్షించారు. పీసీసీ చీఫ్‌తోపాటు మరికొంత మంది ముఖ్య నేతలు వస్తున్నారని వారికి స్వాగతం పలికేందుకు పార్టీ నేతలు, కార్యకర్తలు, వైఎస్సార్ అభిమానులు తరలిరావాలని కోరారు. పార్టీ పూర్వ వైభవానికి షర్మిల కృషి చేస్తారని, ఆమెకు అందరూ సహకారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ అధికార ప్రతినిధి లేళ్లపల్లి సురేష్‌బాబు, కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు ఏటూరి శ్రీనివాసులు రెడ్డి, నగర అధ్యక్షుడు షేక్ ఫయాజ్, డీసీసీ ఉపాధ్యక్షుడు బాలసుధాకర్, నియోజకవర్గాల ఇన్‌చార్జులు చింతాల వెంకట్రావు, దుద్దులూరి రమేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అధికారం కోసం మోసపూరిత వాగ్దానాలు

- రాష్ట్ర ప్రభుత్వంపై యూటీఎఫ్ పోరుబాట




మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి నవకోటేశ్వరరావు

నెల్లూరు (విద్య), జనవరి 24 : వైసీపీ నాయకత్వం అధికారం దక్కించుకునేందుకు మోసపూరిత వాగ్దానాలు చేసి ఉద్యోగ, ఉపాధ్యాయులను మోసం చేసిందని యూటీ ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్ నవకోటేశ్వరరావు ధ్వజమెత్తారు. మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించాలంటూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం నెల్లూరులో పోరుబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. గాంధీబొమ్మ సెంటర్ నుంచి వీఆర్‌సీ మీదుగా కలెక్టరేట్ వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట జరిగిన ఆందోళన కార్యక్రమంలో నవకోటేశ్వర రావు మాట్లాడుతూ గత ఎన్నికలకు ముందు ఉద్యోగ, ఉపాధ్యాయులకు మోసపూరిత వాగ్దానాలు చేసిన వైసీపీ, అధికారంలోకి వచ్చిన తరువాత తమను శత్రువులుగా చూస్తోందని ఆరోపించారు. యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వీవీ శేషులు, జీవీ చలపతిశర్మ మా ట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకపోగా పొదుపు ఖాతాల్లో ఉన్న మొత్తాలను లోన్ రూపంలో తీసుకునే అవకాశం కూడా లేకుండా చేసిందని విమర్శించారు. తాము వెనక డుగు వేయబోయని, ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి పీ బాబురెడ్డి, జిల్లా గౌరవాధ్యక్షుడు కే వెంకటే శ్వర్లు, కోశాధికారి ఏ మురళీధర్‌రావు, కార్యదర్శి ఎన్ సురేంద్రబాబు, జీ దయాకర్, నాగిరెడ్డి, ఖాజావలి, ఎన్ మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రూ.8 లక్షల విలువైన ఎరువుల విక్రయాలు నిలిపివేత

- అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు



దుకాణంలో ఎరువుల లావాదేవీల వివరాలు పరిశీలిస్తున్న ఏడీఏ శ్రీనివాసులు

అల్లూరు, జనవరి 24 : ఎరువులు, పురుగు మందుల విక్రయాల్లో అవక తవకలకు పాల్పడితే కఠిన చర్య లు తప్పవని వ్యవసాయ శాఖ ఏడీఏ ఎస్.శ్రీనివాసులు హెచ్చరించారు. బుధవారం మండలంలోని ఎరువులు, పురుగుమందుల దుకాణాలను ఆయన స్థాని క వ్యవసాయాధికారి లలితతో కలసి పరిశీలించారు. ఎరువుల విక్రయాల లావాదేవీల రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా పలు దుకాణాల్లో విక్రయాల వివరాల నమోదులో అవకతవకలు ఉండడాన్ని గమనించిన ఆయన రూ.8 లక్షల విలువ చేసే ఎరువులను విక్రయించకుండా నిలిపివేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక ధరలకు విక్రయించడంతోపాటు వివరాల నమోదులో అవక తవకలకు పాల్పడడంతో ఈ చర్యలు తీసుకున్నామన్నారు. ఇటువంటి అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

రేపు గణతంత్ర దినోత్సవం

నెల్లూరు(హరనాథపురం), జనవరి 24 : నెల్లూరులోని పోలీసు కవాతు మైదానంలో శుక్రవారం 75వ గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తు న్నామని జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో) ఎస్ లవన్న ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కలెక్టర్ హరినారాయణన్ జాతీయ పతాకావిష్కరణ చేస్తారని, ఆ రోజు ఉదయం 9.10 గంటలకు కలె క్టర్ సందేశం ఉంటుందని తెలిపారు. 9.30 గంటలకు జిల్లా ప్రగతి శకటాల ప్రద ర్శన ఉంటుందని, 10 గంటలకు విద్యా ర్థుల సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన ఉంటుందని పేర్కొన్నారు. 10.50 గంటలకు విశిష్ట సేవలు అందించిన అధికారులు, ఉద్యోగులు, సేవా సంస్థలకు ప్రశంసాపత్రాల ప్రదానం చేస్తారన్నారు. ఆ రోజు సాయంత్రం 6 గంటలకు శ్రీవేంకటేశ్వర కస్తూర్బా కళాక్షేత్రంలో జాతీయ సమైక్యతపై సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

- ఆర్డీవో కార్యాలయం ఎదుట బీటీఏ ఆందోళన



ఆందోళన చేస్తున్న బీటీఏ నేతలు

నెల్లూరు (విద్య), జనవరి 24 : దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని బీటీఏ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం నెల్లూరు రెవెన్యూ డివిజన్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. సంఘం రాష్ట్ర కోశాధికారి ఆది నారాయణ మాట్లాడుతూ ఉపాధ్యాయు లకు చెల్లించాల్సిన పీఎఫ్ లోన్లు, ఏపీజీ ఎల్ఐ లోన్లు, పీఎఫ్ క్లోజర్లు, ఏపీజీఎల్ఐ క్లోజర్లు, సరెండర్ లీవ్‌లు వెంటనే చెల్లించా లన్నారు. డీఏ అరియర్స్ 11వ పీఆర్సీ బకాయిలు చెల్లించడంతోపాటు 12వ పీఆర్సీని ప్రకటించాలని కోరారు. వైసీపీ ప్రభుత్వానికి తగిన రీతిలో బుద్ధి చెపుతామని హెచ్చరించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి మాస ప్రసాద్ మాట్లాడుతూ తమకు న్యాయంగా చెందాల్సిన ఆర్థిక బకాయిలను విడుదల చేయకుండా మానసిక క్షోభకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక మంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పల్లం వేణుగోపాల్, నాయకులు రఘు, తిరుపతయ్య, చిన్నయ్య, భాగ్యమ్మ, కృష్ణయ్య, కిరణ్ కుమార్, ఖాజా రహంతుల్లా, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల బకాయిలు వెంటనే చెల్లించాలి : బీటీపీ



కందుకూరు: సబ్ కలెక్టరు కార్యాలయ ఏవోకు వినతిపత్రం అందజేస్తున్న బీటీపీ ప్రతినిధులు



ఆత్మకూరు: అధికారులకు వినతి పత్రం ఇస్తున్న బీటీపీ నాయకులు

కందుకూరు, జనవరి 24: ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బీటీపీ మొదటి దశ నిరసన కార్యక్రమాల్లో భాగంగా బుధవారం కందుకూరు సబ్ కలెక్టరు కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీటీపీ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కళ్లగుంట మోహనరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్ రద్దు చేయాలని, 11వ పీఆర్సీ బకాయిలు, డీఏ అరియర్స్, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సరెండర్ లీవ్స్ బకాయిలను తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రతినెల 1వ తేదీన జీతాలు చెల్లించాలని, మెగా డీఎస్సీ నిర్వహించి ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీటీపీ నాయకులు కట్టా రమేష్, సంగా మహేంద్ర, షేక్ అబ్దుల్లా, డీ.కోటేశ్వరరావు, మండూరి రమణయ్య, పి.సూర్యనారాయణ, పర్రె వెంకటరావు, పాల్గొన్నారు.

ఆత్మకూరు : ఉద్యోగులకు ప్రభుత్వం చెల్లించాల్సిన ఆర్థిక బకాయిలు వెంటనే చెల్లించాలని బుధవారం బిటీపీ నాయకులు మండల, డివిజనల్ అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీటీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్ వెంకటేశ్వర్లు, ఆత్మకూరు మండల అధ్యక్షుడు జె కొండయ్య, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎం ప్రసాద్, అనంతసాగరం మండల నాయకులు బి బాలయ్య, సంయుక్త కార్యదర్శి ఆర్ వెంకటరమణ, స్నేహకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ బాలికల దినోత్సవం



ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ చిన్నారులు

ఆత్మకూరు, జనవరి 24 : పలు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం జాతీయ బాలికల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ బాలికా విద్యను ప్రోత్సహించడమేకాకుండా, చట్టాలపై అవగాహన కల్పించాలనే లక్ష్యంతో బాలికల దినోత్సవం నిర్వహించడం జరుగుతోందన్నారు. పట్టణంలోని ఎస్సీ కాలనీలో అంగన్‌వాడీ కార్యకర్త రమణమ్మ ఆధ్వర్యంలోర్యాలీ నిర్వహించారు.

మొక్కుబడిగా మండల మావేశం

అనంతసాగరం, జనవరి 24: మండల సర్వసభ్య సమావేశం బుధవారం మొక్కుబడిగా జరిగింది. సభ్యులు, అధికారులు పూర్తిగా హాజరు కాకపోవటంతో ఖాళీగా కుర్చీలు దర్శనమిచ్చాయి. ఇక హాజరైన వారితోనే తూతూ మంత్రంగా కొనసాగించి ముగించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సువర్ణమ్మ, ఎంపీడీవో మధుసుదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పంటలకు ఇన్సూరెన్స్ చేయించాలి

మర్రిపాడు, జనవరి 24: స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో గ్రామ సహాయకులకు పంటకోత ప్రయోగంపై డీఎస్‌వో శ్రీనివాసరావు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వచ్చే రబీ సీజన్‌లో ప్రతీ రైతు వ్యవసాయ పంటను గుర్తించి, ఆ పంటకు ఇన్సూరెన్సు నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో రామ్మోహన్, ఏఎస్‌వో విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఎస్‌ఐ బాధ్యతల స్వీకరణ

వరికుంటపాడు, జనవరి 24: వరికుంటపాడు మండల ఎస్సైగా కె తిరుపతయ్య బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరి సహకారంతో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై సమాచారం అందజేయాలని కోరారు.

సిమెంట్ గోదాము పరిశీలన



సిమెంట్, స్టీల్‌ను పరిశీలిస్తున్న ఈఈ

సంగం, జనవరి 24: స్థానిక గృహనిర్మాణ శాఖ గోడౌన్‌ను ఆ శాఖ ఈఈ దయాకర్ బుధవారం పరిశీలించారు. కార్యాలయంలోని రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం రికార్డుల్లో నమోదు చేసిన సిమెంట్, స్టీల్, గోడౌన్‌లోని నిల్వలను పరిశీలించారు. వర్క్ ఇన్‌స్పెక్టర్ అపర్ణకు గోడౌన్ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట డీఈ ముక్తహర్, ఏఈ కరీముల్లా, సచివాలయ ఇంజనీర్ అసిస్టెంట్‌లు ఉన్నారు.

పల్లెల్లో మద్యం పరవళ్లు

ఉదయగిరి, జనవరి 24: ఉదయగిరి ప్రాంతంలోని అనేక గ్రామాల్లో మద్యం పరవళ్లు తొక్కుతోంది. గండిపాళెం, కృష్ణంపల్లి, నందిపాడు, నర్రవాడ, బసినేనిపల్లి, కొండాయపాళెం, ఉదయగిరిలోని పలు వీధుల్లోని బడ్డీ కొట్లలో మద్యం అధిక ధరకు విక్రయిస్తున్నారు. కొందరు మొబైల్ మద్యం విక్రయాలు చేపడుతున్నారు. ఈ విషయం సెబ్ అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదని గ్రామాల్లో ప్రజలు ఆరోపిస్తున్నారు.

కేశమనేనిపల్లి భూములపై విచారణ చేయిస్తాం : కురుగొండ్ల



రైతులతో కలసి వివాదాస్పద భూములను పరిశీలిస్తున్న కురుగొండ్ల రామకృష్ణ

కలువాయి, జనవరి 24 : మండలంలోని కేశమనేనిపల్లి గ్రామంలో వివాదాస్పదంగా మారిన భూములపై తెలుగుదేశం పార్టీ అధికారంలోని రాగానే విచారణ చేయించి, రైతులకు పట్టాలు ఇప్పిస్తామని వెంకటగిరి మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పేర్కొన్నారు. బుధవారం ఆయన రైతులతో కలిసి వివాదాస్పద భూములు పరిశీలించారు. అనంతరం అక్కడే విలేకరులతో మాట్లాడుతూ ఈ భూముల వ్యవహారం ప్రస్తుతం కోర్టులో ఉందని, ఇందులో అధికారులు గాని, పోలీసులు గానీ జోక్యం చేసుకుంటే వారు కూడా బాధ్యులు అవుతారని ఆయన హెచ్చరించారు. ఆయన వెంట టీడీపీ నాయకులు, రైతులు ఉన్నారు.

అధిష్ఠానం నిర్ణయం మేరకే నడుచుకుంటాం...

వెంకటగిరి టిక్కెట్ విషయంలో తెలుగుదేశం పార్టీ అధిష్ఠానం నిర్ణయం మేరకే నడుచుకుంటామని వెంకటగిరి మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జి కురుగొండ్ల రామకృష్ణ స్పష్టం చేశారు. బుధవారం కలువాయి మండలం కేశమనేనిపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఫిబ్రవరి 15వ తేదీ నాటికి టిక్కెట్ ఖరారు అయ్యే అవకాశం ఉందని చెప్పారు. జనసేన, తెలుగుదేశం పార్టీ కలసి ఎన్నికల్లో పోటీ చేస్తుండడంతో రాష్ట్రంలో 140 స్థానాలు గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఆయన వెంట మండల పార్టీ అధ్యక్షుడు జీ వెంకటేశ్వర్లు నాయుడు, జగదల్ నాయుడు, సోమయ్య యాదవ్, బాలకృష్ణ నాయుడు, చంద్రయ్య నాయుడు, సుధాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఆడుదాం ఆంధ్రా నియోజకవర్గ స్థాయి పోటీల ప్రారంభం

ఆత్మకూరు, జనవరి 24 : పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో ఆడుదాం ఆంధ్రా నియోజకవర్గ స్థాయి పోటీలను జిల్లా జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మనాథ్, అసిస్టెంట్ కలెక్టరు సంజనా సిన్హా, ఆత్మకూరు ఆర్డీవో కె మధులతతో కలిసి ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి బుధవారం లాంఛనప్రాయంగా ప్రారంభించారు. మొదట క్రీడాకారుల నుంచి వందనాన్ని స్వీకరించి క్రీడాజ్యోతిని వెలిగించి క్రీడలను ప్రారంభించారు. అనంతరం ఆయన పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో యూనిసెఫ్ వారి సహకారంతో మున్సిపాల్టీ కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన హ్యాండ్‌వాష్ స్టేషన్‌ను ప్రారంభించారు. తదనంతరం మున్సిపల్ బస్టాండ్ వద్ద అభిరామ్ మల్టీస్పెషాల్టీ హాస్పటల్ సౌజన్యంతో అందజేసిన ఫస్ట్‌ఎయిడ్ కిట్లను డ్రైవర్లకు అందజేశారు. అక్కడ నుంచి పట్టణంలోని అర్బన్ ప్రైమరీ హెల్త్‌కేర్ సెంటర్ వద్దకు వెళ్లి అక్కడ నిర్వహిస్తున్న రెండవ విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ బి నాగేశ్వరరావు, చైర్‌పర్సన్ జి వెంకటరమణమ్మ, వైస్‌చైర్మన్ డాక్టర్ కెవి శ్రావణ్‌కుమార్, జేఏసీ కన్వీనర్ డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య, శాప్ డైరెక్టర్ కాలువ నరసింహులు, డీఎల్‌డీవో రమణయ్య, ఎంపీడీవో పి ఐజాక్‌ప్రవీణ్, పలువురు మున్సిపల్ కౌన్సిలర్లు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

వింజమూరు : స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం నియోజకవర్గ స్థాయి ఆడుదాం ఆంధ్ర క్రీడలను ఉదయగిరి నియోజకవర్గం వైసీపీ ఇన్‌చార్జ్ మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, మేకపాటి అభినయరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రికెట్ పోటీలు నిర్వహించారు. పోటీలలో ప్రతిభ చూపిన విద్యార్థులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో చిరంజీవులు, జడ్పీటీసీ గణపం బాలకృష్ణారెడ్డి, సర్పంచ్ నల్గొండ సృజన, సొసైటీ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి, ఎంపీడీవో సచివాలయ సిబ్బంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆసరా చెక్కుల పంపిణీ

చేజర్ల: మండలంలో ఆత్మకూరు శాసనసభ్యుడు మేకపాటి విక్రమ్‌రెడ్డి బుధవారం పర్యటించారు. చేజర్లలో పొదుపు మహిళలకు ఆసరా చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం కోటితీర్థం గ్రామంలో పలు అభివృద్ధి పథకాలను ప్రారంభించారు. కాగా, చేజర్లలో జరిగిన ఆసరా కార్యక్రమానికి హాజరైన పొదుపు మహిళలకు కనీస అవసరాలు కల్పించకపోవడంతో నానా అవస్థలు పడ్డారు. రాకపోతే ఆసరా చెక్కులలో సంతకాలు పెట్టరని, అందరూ తప్పకుండా రావాలనే వీఏఏల ఆదేశాలతో పనులు మానుకుని వచ్చామని, అయితే తాగడానికి మంచినీళ్ళు కూడా ఇవ్వలేదని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ విజయభాస్కర్ రెడ్డి, జడ్పీటీసీ పీర్ల పార్థసారధి, గోతం వెంకటసుబ్బయ్య, వీరరాఘవరెడ్డి అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సెమినార్‌తో విద్యార్థులకు ఉపయోగం



సర్టిఫికెట్లు అందిస్తున్న ప్రిన్సిపాల్

ఉదయగిరిరూరల్, జనవరి 24: కళాశాలల్లో వివిధ విభాగాలకు సంబంధించి నిర్వహించే సెమినార్లు విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సుబ్బలక్ష్మమ్మ అన్నారు. బుధవారం స్థానిక కళాశాలలో జంతుశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన సెమినార్‌లో ఆమె మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలతో విద్యార్థులు విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ నరసింహులు, కార్యనిర్వాహక కార్యదర్శులు నాగేంద్ర, ప్రసాద్, చక్రపాణి, కో ఆర్డినేటర్ విక్రమ్, గోపాలకృష్ణ, కృష్ణకుమార్, అనిల్‌కుమార్, సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.

తెగుళ్ల నివారణపై అవగాహన



శనగ పంటను పరిశీలిస్తున్న అధికారులు

దుత్తలూరు(ఉదయగిరిరూరల్), జనవరి 24: మండలంలోని మందాలపల్లిలో సాగులో ఉన్న శనగ, వరి పంటలను బుధవారం ఏడీఏ చెన్నారెడ్డి పరిశీలించారు. వరిలో సోకిన అగ్గి తెగులు, శనగకు వ్యాపించిన పచ్చ పురుగును గుర్తించి నియంత్రణకు వినియోగించాల్సిన ఎరువులు, పురుగు మందులపై అవగాహన కల్పించారు. అలాగే రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలను వివరించారు. కార్యక్రమంలో ఏవో వెంకటసుబ్బారెడ్డి, వీఏఏలు తనూజా, కేశవ తదితరులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి

ఉదయగిరిరూరల్, జనవరి 24: పంటలు సాగు చేసిన రైతులు ఈ-క్రాప్‌ను తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని ఏవో ఆంజనేయ నాయక్ అన్నారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ ఈ-క్రాప్‌తో రైతులకు సున్నావడ్డీ రుణాలు, పంటల బీమా, నష్టపరిహారం, గిట్టుబాటు ధర తదితర పథకాలు వర్తిస్తాయన్నారు. కావున రైతులు ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలని కోరారు.

పూర్వ విద్యార్థుల చేయూత



వేతనాలు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

వరికుంటపాడు, జనవరి 24: మండలంలోని కాకొల్లువారిపల్లి ఉన్నత పాఠశాలలో విధులు నిర్వర్తించే విద్యా వలంటీర్లకు బుధవారం పూర్వ విద్యార్థులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి వేతనాలను అందజేశారు. 1984 విద్యా సంత్సరానికి చెందిన పూర్వ విద్యార్థి బూరగ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో అక్కడ విద్యాభ్యాసం చేసిన పలువురు తమవంతు చేయూతగా ఏడాది వేతనాలను అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భవిష్యత్తులోను పాఠశాల అభివృద్ధికి సహకారం అందిస్తామని హామీనిచ్చారు.

సొంత చెల్లెలే జగన్‌రెడ్డిని నమ్మడం లేదు!

● టీడీపీ కందుకూరు ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న ఇంటూరి నాగేశ్వరరావు

ఉలవపాడు, జనవరి 24 : పీసీసీ అధ్యక్షురాలు షర్మిల తన సొంత అన్న వైఎస్ జగన్‌రెడ్డిని నమ్మడం లేదని అలాంటిది రాష్ట్ర ప్రజలను నట్టేట ముంచిన వ్యక్తిని ఏవిధంగా నమ్మతారని టీడీపీ కందుకూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. బుధవారం ఉలవపాడులో జరిగిన జయహో బీసీ కార్యక్రమంలో ఇంటూరి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. బీసీలకు న్యాయమంటూ జరిగిందంటే అది తెలుగుదేశం పార్టీతోనేనని, బీసీల ఆత్మగౌరవం నిలబెట్టి పెద్దపీట వేసి సముచిత స్థానం కల్పించిన ఘనత ఎన్టీఆర్, ఆ తరువాత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. జగన్‌పై రాష్ట్ర ప్రజల్లో నమ్మకం పోయిందని, చంద్రబాబు నాయుడే ఈ రాష్ట్రాన్ని కాపాడే శక్తి కలిగిన వ్యక్తి అని నమ్ముతున్నారన్నారు. నియోజకవర్గంలో ఒక్క బీసీ నాయకుడుకి కూడా నామినేటెడ్ పదవులు ఇవ్వడానికి మనసు ఒప్పని వ్యక్తి స్థానిక ఎమ్మెల్యే అని విమర్శించారు. ఈ సందర్భంగా విచ్చేసిన వివిధ బీసీ సంఘాల నాయకులు ఆయా వర్గాల ప్రజలకు వైసీపీ ప్రభుత్వం చేసిన అన్యాయ, అరాచకాలను వివరించారు. తొలుత బీఆర్ అంబేడ్కర్, జ్యోతిరావుపూలే, ఎన్టీఆర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ మాజీ చైర్మన్ చెంచలబాబుయాదవ్, రాష్ట్ర బీసీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి చిలకపాటి మధు, ఆప్కో మాజీ చైర్మన్ కొండూరు పాలిశెట్టి, మండల అధ్యక్షుడు రాచగల్లు సుబ్బారావు, పీఎల్ రావు, నెల్లురు పార్లమెంట్ బీసీ సెల్ అధ్యక్షుడు కప్పిర శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు ఆర్థిక సాయం : ఉలవపాడు పంచాయతీ పరిధిలోని కొల్లూరుపాడు ఎస్సీ కాలనీలో టీడీపీ కార్యకర్తలు దామతోటి సురేష్‌కు, దామతోటి బ్రహ్మయ్యలు కొన్ని రోజులుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతుండటంతో వారిని ఇంటూరి నాగేశ్వరరావు బుధవారం పరామర్శించారు. వారికి ఆర్థిక సహాయం అందచేశారు. అదేవిధంగా రోడ్డు ప్రమాదంలో చనిపోయిన దామతోటి వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.

బొల్లినేనికి సంఘీభావంగా 'ప్రజా దీవెన'



మహిళకు కరపత్రం అందజేస్తున్న నాయకులు

కొండాపురం, జనవరి 24: ఉదయగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి బొల్లినేని వెంకట రామారావు చేపట్టిన ప్రజా దీవెన యాత్రకు సంఘీభావంగా టీడీపీ మండల కన్వీనర్ మామిళ్లపల్లి ఓంకారం ఆధ్వర్యంలో బుధవారం గరిమెనపెంట, తూర్పుఎర్రబల్లి పంచాయతీలో నిర్వహించారు. టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలతోపాటు ఎన్నికల కమిషన్ నూతనంగా విడుదల చేసిన ఓటరు జాబితాలను గ్రామ నాయకులకు అందచేశారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు పార్లమెంటు అధికార ప్రతినిధి యారవ క్రిష్ణయ్య, రైతు కార్యదర్శి పోలినేని రమేష్, దగడ మాలకొండారెడ్డి, రామమోహనరావు, పీ.తిరుపతిరెడ్డి తదితరుల పాల్గొన్నారు.

ఆర్టీసీలో రోడ్డు భద్రతా మాసోత్సవాలు

కావలి, జనవరి 24: కావలి ఆర్టీసీ డిపో గ్యారేజీలో బుధవారం రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా డ్రైవర్స్ డే కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిధిగా పాల్గొన్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ డ్రైవర్ల పట్ల కృతజ్ఞతాభావం కలిగి ఉండాలన్నారు. డిపో మేనేజరు రాపూరు శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అత్యధిక ఇంధన పొదుపు చేసిన 25 మంది డ్రైవర్లకు శాలువలతో సత్కరించి ప్రశంసాపత్రాలు అందచేశారు. అనంతరం ఎమ్మెల్యేను పలు కార్మికసంఘాల నాయకులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్, ఆర్టీసీ అధికారులు, కార్మిక యూనియన్ నాయకులు, వైసీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్య ద్వారానే బాలికల అభివృద్ధి



మాట్లాడుతున్న ఉపాధ్యాయిని హైమారాణి

లింగసముద్రం, జనవరి 24 : విద్య ద్వారానే బాలికలు అభివృద్ధి చెందుతారని పెంట్రాల యూపీ పాఠశాల తెలుగు ఉపాధ్యాయిని శ్రీమతి హైమారాణి చెప్పారు. బుధవారం పెంట్రాల యూపీ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు ఎం శ్రీనివాసులు ఆధ్వర్యంలో జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. బాలికల రక్షణ కొరకు ప్రభుత్వాలు అనేక చట్టాలు చేశాయని చెప్పారు. బాలికలు, మహిళలు లింగ వివక్షకు వ్యతిరేకంగా పోరాడితేనే సమానత్వం వస్తుందన్నారు. అనంతరం బాలికలకు పెన్నులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె మోహన్‌రావు, సంధ్యారాణి ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.ఐ

అవినీతి అంతం 'ఆమ్-ఆద్మీ' లక్ష్యం

కలిగిరి, జనవరి 24: అవినీతి అంతం ఆమ్-ఆద్మీ లక్ష్యం అనే నినాదంతో రానున్న ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌లో ఆమ్-ఆద్మీ పార్టీ ఎన్నికల బరిలో నిలుస్తుందని ఆ పార్టీ నాయకులు మణి నాయుడు, సీరా రమేష్, గుర్రంకొండ సర్దార్‌లు పేర్కొన్నారు. ఆమ్-ఆద్మీ పార్టీ ఉదయగిరి ఇన్‌చార్జ్ అరిగెల శ్రీనివాసులు నేతృత్వంలో బుధవారం కలిగిరి పట్టణంలో కలిగిరమ్మ దేవాలయం కూడలి నుంచి ఆర్టీసీబస్ స్టేషన్ వరకు ర్యాలీ చేసి పరిచయ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల పోరాటం విజయవంతం

బిట్రగుంట, జనవరి 24: న్యాయమైన అంగన్వాడీ వర్కర్లు 42 రోజులుల అలుపెరగని పోరాటం చేసి ఎట్టకేలకు విజయం సాధించారని సీపీఎం మండల కార్యదర్శి తుమ్మల వెంకయ్య అన్నారు. బోగోలులోని సీపీఎం కార్యాలయంలో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ అంగన్వాడీలు తమ న్యాయమైన కోర్కెలు తీర్చాలని చేస్తున్న ధర్నాని ఎస్మా చట్టం ద్వారా భయపెట్టాలని చూసిన జంక కుండా నిలిచారని, వారికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి చల్లా నరహరి, టైలర్ బాషా, వినయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

బిట్రగుంట, జనవరి 24: బోగోలుకు చెందిన ఎస్వీఎస్ చారటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు మద్దిబోయిన శేషాద్రియాదవ్ తండ్రి వెంకటసుబ్బయ్య (78) ఇటీవల మృతి చెందాడు. బుధవారం ఆయన ఉత్తర క్రియలకు రాజ్యసభ సభ్యుడు బీదమస్తాన్‌రావు హాజరై శేషాద్రిని పరామర్శించి ఆయన తల్లితండ్రుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే వైసీపీ మండల కన్వీనర్ ఎం వీరరఘు, టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరరావు, బీఎంఆర్ కంపెనీ అధికారి బ్రహ్మానందరెడ్డి, స్వచ్ఛంద సేవా సంస్థల నిర్వాహకుడు బాలశైలజ, ప్రభాకర్‌రెడ్డి, తదితరులు మద్దిబోయిన కుటుంబాన్ని పరామర్శించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కందుకూరు, జనవరి 24: పట్టణంలోని కోవూరు రోడ్డులో లైన్‌వర్క్ జరుగుతున్నందున ఉప్పుచెరువు ఫీడర్‌లోని పలు ప్రాంతాల్లో గురువారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని పట్టణ ఏఈ టీవీ నరసింహం ఒక ప్రకటనలో తెలిపారు. మగ్గాలమిల్లు ప్రాంతం, ఉప్పుచెరువు, ఏకలవ్యనగర్, పాలిటెక్నిక్ కాలేజీ, జనార్దన కాలనీ, దుర్గమ్మగుడి, బృందావనం, మాయాబజారు ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని, ప్రజలు అసౌకర్యాన్ని గుర్తించాలని కోరారు.

బట్రకాగొల్లు యానాదులపై దాడి అమానుషం



తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న దళితులు, గిరిజనులు

అల్లూరు, జనవరి 24 : బట్రకాగొల్లులో యానాదులపై దాడి చేయడం అమానుషమని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.మల్లి అన్నారు. మంగళవారం బట్రకాగొల్లు పొలాల్లో జరిగిన వివాదంలో స్థానిక గిరిజనుడు చేవూరి సురేష్‌పై అదే గ్రామానికి చెందిన బి.మహేష్, సుధాకర్‌లు దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. ఈ దాడిని నిరసిస్తూ దళిత సంఘర్షణ సమితి, జిల్లా యానాది సమాఖ్యల ఆధ్వర్యంలో బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మల్లి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి దళితులు, గిరిజనులపై దాడులు అధికమైపోయాయని, న్యాయం కోసం పోలీసు స్టేషన్లను ఆశ్రయిస్తే అక్కడ కూడా పార్టీ నాయకుల కనుసన్నల్లో పోలీసులు మెలుగుతూ బాధితులపైనే అక్రమంగా కేసులు బనాయించే పరిస్థితి వాటిల్లిందన్నారు. పొలానికి నీటిని పారించుకునే విషయంపై ఇటువంటి దాడులకు పాల్పడడం అన్యాయమన్నారు. అనంతరం తహసీల్దారు చంద్రశేఖర్‌ను కలసి వినతిపత్రాన్ని అందిస్తూ ఈ విషయమై విచారించి సమస్యను పరిష్కరించాలని, పోలీసులను ఆదేశించి కేసు నమోదు చేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మానవ హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్లు సాల్మన్‌రాజు, యానాది సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు బాపట్ల సత్యవతమ్మ, చేవూరు శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

● రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు



చెక్కు పంపిణీ చేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యేలు

కావలి రూరల్, జనవరి 24: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు పేర్కొన్నారు. కావలి ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో బుధవారం ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన వైఎస్ఆర్ ఆసరా 4వ విడత కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పొదుపు మహిళలచే కేక్ కట్ చేయించిన అనంతరం కావలి పట్టణానికి చెందిన 1,153 స్వయం సహాయక సంఘాలలోని 10,565 మంది సభ్యులకు రూ.8,77,00,123 చెక్కు, రూరల్ మండలంలోని 1,131 సహాయ సంఘాలల్లోని 11,428 మంది సభ్యులకు రూ.8 కోట్ల 90 లక్షల చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మెప్మా పీడీ రవీంద్ర, నియోజకవర్గ పరిశీలకుడు కుప్పం ప్రసాద్, ఆర్డీవో శీనానాయక్, మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్, నియోజకవర్గ ప్రత్యేక అధికారి రవికుమార్, జడ్పీటీసీ రాఘవులు, ఎంపీపీ ఆలూరు కొండమ్మ, ఏఎంసీ చైర్మన్ ప్రసాద్, వైసీపీ నాకులు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, కామరాజు, గ్రంధం ప్రసన్నాంజనేయులు, షాహుల్, కనుమర్లపూడి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

30 వాహనాల బహిరంగ వేలం

● ప్రభుత్వానికి రూ.5.40 లక్షల రాబడి



వాహనాల వేలం నిర్వహిస్తున్న ఆర్టీవో సుధాకర్‌రెడ్డి

కావలి రూరల్, జనవరి 24: కావలి ప్రాంతీయ రవాణా శాఖ కార్యాలయం పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు కావలి ఆర్టీవో సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం వేలం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీవో సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఉపరవాణా శాఖ కమీషనర్ బి. చందర్ ఆదేశాల మేరకు వివిధ కేసుల్లో పట్టుబడిన 33 వాహనాల్లో 30 వాహనాలకు బహిరంగ వేలం నిర్వహించామన్నారు. ఈ వేలం ద్వారా ప్రభుత్వానికి రూ.5.40 లక్షల ఆదాయం చేకూరిందన్నారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు ఆర్టీవో కార్యాలయ ఏవో కిషోర్, మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ సుందరరావు, అసిస్టెంట్ మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్, కావలి ఆర్టీవో కార్యాలయ ఏవో సుభాషిణి, తదితరులు పాల్గొన్నారు.

తూర్పుదూబగుంటలో 'వికసిత్ భారత్'



డ్రోన్‌ను పరిశీలిస్తున్న అరుణాచలప్రదేశ్ ఎంపీ

కలిగిరి, జనవరి 24: మండలంలోని తూర్పుదూబగుంటలో బుధవారం జరిగిన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర లో బీజేపీకి చెందిన అరుణాచలప్రదేశ్ ఎంపీ నాభం రేబియా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ అధికారం చేపట్టినప్పటి నుంచి గ్రామస్థాయిలో పేదలకు సంక్షేమ ఫలాలు నేరుగా అందుతున్నాయన్నారు. కేంద్రపథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లే విధంగా వికసిత్ భారత్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారన్నారు. బీజేపీ పాలన రైతులకు పెద్దపీట వేసిందన్నారు. పీఎం కిసాన్‌తో రైతుకు ఆర్థికంగా వెసలుబాటు కలగడంతో పాటు, వ్యవసాయంలో విప్లవాత్మక మార్పులు బీజేపీ పాలనలోనే సాధ్యమయ్యాయన్నారు. ప్రధాని మోదీ పాలనలో ప్రపంచ దేశాలకు దీటుగా భారత్ అభివృద్ధిలో పురోగమిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, అధికారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రా పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే



బ్యాటింగ్ చేసి పోటీలను ప్రారంభిస్తున్నఎమ్మెల్యే

కందుకూరు, జనవరి 24: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలల ఆట స్థలంలో కందుకూరు మండల స్థాయి ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీలను ఎమ్మెల్యే మానుగుంట మహీధరరెడ్డి బుధవారం ప్రారంభించారు. వివిధ ఆటలకు సంబంధించి ఏర్పాట్లు చేసినప్పటికీ ఆశించిన స్థాయిలో క్రీడాకారులు హాజరు కాకపోవడంతో స్థానిక ఉన్నత పాఠశాలల్లోని క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొనటం విశేషం. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయశేఖర్, పీఈటీలు పాల్గొన్నారు.

ఉత్సాహంగా నియోజకవర్గ స్థాయి...

కావలిటౌన్, జనవరి 24: పట్టణంలోని జడ్పీ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో బుధవారం ఆడుదాం ఆంధ్ర నియోజకవర్గస్థాయి పోటీలు ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి, ఆర్డీఓ శీనానాయక్, మున్సిపల్ కమిషనర్ శ్రావణ్ కుమార్, ఎంపీడీవోలు పాల్గొన్నారు. ముందుగా ఎమ్మెల్యే జ్యోతి ప్రజ్వలన చేసి, జాతీయ జెండా ఆవిష్కరించి, పావురాలు ఎగురవేసి క్రీడావందనం స్వీకరించారు. క్రీడాజ్యోతి వెలిగించి క్రీడలు ప్రారంభించారు. పోటీల నిర్వహణకు సహకరించిన పీడీలు ప్రసాద్ రెడ్డి, మణికంఠలను సత్కరించారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ పీడీ చిరంజీవి, పీఈటీలు పాల్గొన్నారు.

కురిచెర్లపాడులో వికసిత భారత్

వెంకటాచలం, జనవరి 24 : మండలంలోని కురిచెర్ల పాడు గ్రామంలో బుధవారం వికసిత భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. ఎంపీడీవో ముజిబున్నిసా, మండల పంచాయతీ విస్తరణాధికారి జే వెంకటరమేష్, కసుమూరు వైద్యాధికారిణి డాక్టర్ ప్రవల్లిక, సర్పంచ్ అక్బర్ బాష పాల్గొని మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ ప్రధానమంత్రి ఆరోగ్య యోజన పథకం కింద ప్రతి ఒక్కరికీ రూ.5 లక్షల ఉచిత చికిత్సలు అందే కార్డులు, రాష్ట్ర ప్రభుత్వం డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ హెల్త్‌కార్డులు ప్రతి ఇంటికీ పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం కింద అందించే సేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని సూచించారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి : టీఎన్ఎస్ఎఫ్

వెంకటాచలం, జనవరి 24 : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని టీఎన్ఎస్ఎఫ్ మండలాధ్యక్షుడు నలబాలపు వెంకటాద్రి డిమాండ్ చేశారు. బుధవారం టీఎన్ఎస్ఎఫ్ నాయకులతో కలిసి వెంకటాచలం ఎంఈవోకి ఆయన వినతిపత్రాన్ని అందజేశారు. ఆయన మాట్లాడుతూ అక్షయపాత్ర ద్వారా విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న పథకం భోజనంలో నాణ్యత లోపించిందన్నారు. విద్యార్థుల సంక్షేమాన్ని వైసీపీ ప్రభుత్వం గాలికి వదిలేసిందని విమర్శించారు. కార్యక్రమంలో సయ్యద్ కాలేషా, మనోజ్, మహేష్, సాయి, చందు, శ్రీను, శశి తదితరులున్నారు.

పాతవంగల్లు గ్రామ టీడీపీ అధ్యక్షుడిగా రవిబాబు

కొడవలూరు జనవరి 24 : టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి ఆదేశాలు మేరకు పాత వంగల్లు గ్రామ టీడీపీ అధ్యక్షుడుగా సిరిమావిళ్ల రవిబాబును నియమించినట్లు టీడీపీ మండల అధ్యక్షుడు కొటంరెడ్డి అమరేంద్రరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యక్షుడుగా నన్నం వెంకటరావు, ప్రధానకార్యదర్శిగా మోర కుమార్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా గుంజి రఘురామయ్య, వల్లెపు కుమారి, మోర్ల చంద్ర, తురుకా మధు, కార్యవర్గ సభ్యులుగా సిరిమావిళ్ల సురేష్ కుమార్, మోదేపల్లి చిన్నయ్యను నియమించినట్లు పేర్కొన్నారు.

మృతురాలి కుటుంబానికి పోలంరెడ్డి పరామర్శ

కోవూరు, జనవరి 24: స్థానిక సత్రం వీధిలో నివాసం ఉంటున్న టీడీపీ నాయకుడు నిక్కుదల నాగేశ్వరరావు తల్లి బుజ్జమ్మ బుధవారం మృతి చెందారు. మృతదేహాన్ని మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి వెంట టీడీపీ నాయకులు ఇంతా మల్లారెడ్డి, చెముకుల కృష్ణచైతన్య, అత్తిపల్లి శివప్రసాద్‌రెడ్డి, పిచ్చుక మధుసూదనరావు, గాదిరాజు అశోక్‌కుమార్, ఉయ్యూరు వేణు, టవికుమార్ తదితరులు నివాళులర్పించారు.

పొదుపు సంఘాలతో సమీక్ష

బుచ్చిరెడ్డిపాళెం, జనవరి 24: బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ కార్యాలయంలో మెప్మా సీఓ నర్మద అధ్వర్యంలో బుచ్చి 4వ సంఘ బంధం పొదుపు సంఘాల మహిళలతో బుధవారం సమీక్షా సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంల ఆర్‌పీ షబ్నం, పొదుపు సంఘాల మహిళలు పాల్గొన్నారు.

గాంధీనగర్‌లో 'జగనన్న ఆరోగ్య సురక్ష'

బుచ్చిరెడ్డిపాళెం, జనవరి 24: బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీలోని గాంధీనగర్ సచివాలయం పరిధిలోని అంబేడ్కర్ భవన్‌లో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డిలు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. 618 మంది రోగులకు వైద్యాధికారులు, సిబ్బంది ఈసీజీ, బీపీ, షుగర్, రక్త పరీక్షలు నిర్వహించారు. అవసరమైన రోగులకు మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి మనోజ్, తదితరులు పాల్గొన్నారు.

దేగపూడిలో పొలంబడి

పొదలకూరు, జనవరి 24 : మండలంలోని దేగపూడి, దుగ్గుంట, రాజుపాలెం గ్రామాలలో పొలంబడి కార్యక్రమాన్ని బుధవారం వ్యవసాయ శాఖ అధికారులు నిర్వహించారు. జిల్లా వ్యవసాయ ఉప సంచాలకులు శివనారాయణ (డీడీఏ), పొదలకూరు ఏడీఏ కె శివనాయక్ రైతులకు పంటల సాగు, చీడపీడల నివారణ, పురుగు మందుల వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ఎస్‌ఓ వెంకటేశ్వర్లు, ఏడీఏ మారుతీదేవి, ఏవోలు శైలజ, గీత, గ్రామ వ్యవసాయ సహాయకులు ఆశ్రిత, జస్సీ, అశ్విని, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ఆవిర్భావంతోనే

బీసీలకు చట్టసభల్లో అవకాశం

- 'జయహో బీసీ' సభలో పోలంరెడ్డి దినేష్‌రెడ్డి


'జయహో బీసీ' సభలో మాట్లాడుతున్న దినేష్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం, జనవరి 24: టీడీపీని స్థాపించి బీసీ సామాజిక వర్గాలకు చట్టసభల్లో అవకాశం కల్పించిన మహనీయుడు ఎన్టీఆర్ అని కోవూరు టీడీపీ ఇన్‌చార్జి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన బుచ్చిలోని ఓ కల్యాణ మండపంలో జరిగిన జయహో బీసీ సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎన్నో పథకాలు ప్రవేశపెడితే వైసీపీ వాటిని తొలగించిందన్నారు. బీసీ కార్పొరేషన్‌ను 56 కార్పొరేషన్లుగా విడదీశారన్నారు. ఒక్క కార్పొరేషన్లో కూడా కూర్చునేందుకు కుర్చీకూడా లేదన్నారు. జడ్పీ మాజీ చైర్మన్ చెంచలబాబు యాదవ్ మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చాక బీసీ సామాజిక వర్గాలపై మహిళలని కూడా చూడకుండా దుర్మార్గాలు చేశారన్నారు. కప్పిర శ్రీనివాసులు మాట్లాడుతూ వైసీపీ నాయకులు తనతోపాటు తన కుటుంబంపై చేసిన దుర్మార్గాలు, పడిన బాధలను వివరించారు. కార్యక్రమంలో నాయకులు దంపతులు, పోలిశెట్టి, జంజం రాఘవేంద్రరావు, ఎంవీ శేషయ్య, హరికృష్ణ, హరనాథ్, కృష్ణచైతన్య, ఉసురుపాటి, రామానాయుడు, బాలాకుమార్, బచ్చాబాయ్, తాళ్లస్వామి, తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గస్థాయిలో 'ఆడుదాం ఆంధ్రా'

బుచ్చిరెడ్డిపాళెం, : బుచ్చి నగర పంచాయతీలోని డీఎల్ఎన్ఆర్ హైస్కూలు క్రీడా ప్రాంగణం, రామచంద్రాపురంలోని గుత్తికొండ శ్రీరాములు డిగ్రీ కళాశాల క్రీడా ప్రాంగణంలో బుధవారం నియోజకవర్గం స్థాయిలో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో వాలీబాల్, కబడ్డీ, క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి, ఎంపీపీ శ్రీనివాసులు, ఎంపీడీఓ నరసింహారావు, ఎంఈవో దిలీప్‌కుమార్, నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ ప్రారంభించారు.

పడుగుపాడులో రక్తదాన శిబిరం

కోవూరు, జనవరి 24: పడుగుపాడులోని లక్ష్మీనారాయణపురం కాలనీలో కొమారి రెడ్డయ్య వర్ధంతి సందర్భంగా కొమారి రెడ్డయ్య చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో బుధవారం రక్తదానం శిబిరం నిర్వహించారు. రెడ్‌క్రాస్ సంస్థ సహకారంతో జరిగిన రక్తదాన శిబిరంలో యువకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి మాట్లాడుతూ రెడ్డయ్య జ్ఞాపకార్థం నాలుగేళ్లుగా కార్యక్రమాలు నిర్వహిస్తుండటం అభినందనీయమంటూ ట్రస్టు చైర్మన్ ప్రసాద్‌ను అభినందించారు. శిబిరంలో టీడీపీ నాయకులు ఇంతా మల్లారెడ్డి, చెముకుల కృష్ణచైతన్య, సూరిశెట్టి శ్రీనివాసులు, చెంబేటి పెంచలయ్య, ఫైరోజ్,నాటకరాని వెంకట్ పాల్గొన్నారు.

రాబోయేది టీడీపీ-జనసేన ప్రభుత్వమే : బొబ్బేపల్లి


మనుబోలుకు చేరుకున్న జనసేన పాదయాత్ర

మనుబోలు, జనవరి 24: ఎన్నికల తరువాత రాబోయేది టీడీపీ-జనసేన ప్రభుత్వమేనని సర్వేపల్లి నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి బొబ్బేపల్లి సురేష్ నాయుడు అన్నారు. జనసేన పాదయాత్ర బుధవారం మనుబోలు చేరుకుంది. స్థానిక దళితవాడలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి అక్కడుంచి మనుబోలు ప్రధానరోడ్డుపై పాదయాత్ర సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక వైసీపీ ప్రభుత్వానికి 40రోజులే మిగిలి ఉన్నాయన్నారు. పాదయాత్రలో వైసీపీ చేసిన అరాచకాలను ప్రజలకు వివరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు జాకీర్, ఖాదర్‌వలీ, సుధాకర్, బాషా తదితరులు పాల్గొన్నారు.

అనుమతులు ఇచ్చి గొడవలు సృష్టించకండి

- తహసీల్దార్‌కు గ్రామస్థుల వినతి


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న చెర్లోపల్లి గ్రామస్థులు

మనుబోలు, జనవరి 24: తమ గ్రామంలో మండపంకు గాని, అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు కాని అనుమతులు ఇచ్చి గొడవలు సృష్టించవద్దని చెర్లోపల్లి గ్రామ స్థులు బుధవారం తహసీల్దార్ బి శివకృష్ణయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని సర్వేనెం. 54-3లో దాసరి విజయమ్మ ఇంటిముందు ఖాళీ స్థలం ఉందని, అందులో 2020లో అంబేడ్కర్ విగ్రహం పెట్టాలని అనుమతులు అడిగితే ఇవ్వలేదన్నారు. అయితే ఇప్పుడు అదే స్థలంలో నాలుగుకాళ్ళ మండపం కట్టాలని కొందరు ప్రయత్నిస్తున్నారన్నారు. వారికి అనుమతులు ఇవ్వవద్దన్నారు. ఇస్తే తాము విగ్రహం పెట్టుకునేందుకు అనుమతి ఇవ్వాలన్నారు. లేదంటే ఇద్దరికీ అనుమతులు ఇవ్వవద్దన్నారు. ఒకరికి అనుమతి ఇచ్చి మరొకరికి అనుమతి ఇవ్వకపోతే గొడవలు జరిగే అవకాశం ఉందన్నారు. దీనిపై తహసీల్దార్ వీఆర్‌వోను పంపి విచారణ చేసి తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.

రైతుల గురించి ఆలోచించే తీరిక మంత్రి కాకాణికి లేదు

- ఆర్‌వై పాలెం గ్రామస్థులు టీడీపీలో చేరిక


సోమిరెడ్డి సమక్షంలో టీడీపీ చేరిన ఆర్‌వైపాలెం గ్రామస్థులు


పొదలకూరు, జనవరి 24 : సోమశిల దక్షిణ కాలువ, కండలేరు ఎడమ కాలువ ద్వారా వేల ఎకరాలకు నీరు అందక రైతులు అల్లాడుతుంటే రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధనరెడ్డికి వారి సమస్యల గురించి ఆలోచించే తీరిక లేదని మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విమర్శించారు. బుధవారం మండలంలోని ఆర్‌వై పాలెం గ్రామంలో బాబు షూరిటీ - భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించి, ఇంటింటికీ తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. కాగా, గ్రామంలోని ఎస్సీ కాలనీలో దేవరపాటి హనుమంతు, నారాయణ, పెంచల నరసమ్మ, కామంచి రాములమ్మ, దేవరపాటి మారుతీ అనే రెండు కుటుంబాల వారు టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో ఆర్‌వై పాలెం టీడీపీ నాయకులు నల్లగంగు వెంకటేశ్వరరెడ్డి, అల్లం దశయ్య, మందపల్లి ప్రవీణ్, జనసేన నాయకులు దాసినేటి అనీల్‌కుమార్, బండి మనోజ్‌కుమార్, టీడీపీ మండల అధ్యక్షుడు తలచీరు మస్తాన్‌బాబు, పట్టణ అధ్యక్షుడు బొద్దు లూరు మల్లికార్జున్‌నాయుడు, బక్కయ్యనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రా విజేతలు వీరే

పొదలకూరు, జనవరి 24 : తోడేరు గ్రామ పంచాయతీ కాకాణి రమణారెడ్డి స్టేడియంలో జరిగిన సర్వేపల్లి నియోజకవర్గం ఆడుదాం ఆంధ్ర పోటీలలో విజేతలను స్థానిక ఎంపీడీవో నగేష్‌కుమారి బుధవారం ప్రకటించారు. పురుషుల బ్యాడ్మింటన్ విన్నర్‌గా పొదలకూరు జట్టు, రన్నర్‌గా ముత్తుకూరు, మూడో స్థానంలో తోటపల్లి గూడూరు నిలిచిందన్నారు. అదేవిధంగా మహిళల బ్యాడ్మింటన్‌లో విన్నర్‌గా తోటపల్లిగూడూరు, రన్నర్‌గా ముత్తుకూరు, మూడో స్థానంలో పొదలకూరు నిలిచిందన్నారు. పురుషుల వాలీబాల్‌లో విన్నర్‌గా వెంకటాచలం, రన్నర్‌గా ముత్తుకూరు, మూడో స్థానంలో పొదలకూరు జట్టు, మహిళల వాలీబాల్‌లో విన్నర్‌గా తోటపల్లిగూడూరు జట్టు, రన్నర్‌గా మనుబోలు, తృతీయ స్థానంలో వెంకటాచలం నిలిచిందన్నారు. మహిళల క్రికెట్‌లో విన్నర్‌గా వెంకటాచలం, రన్నర్‌గా తోటపల్లిగూడూరు, మూడో స్థానంలో పొదలకూరు నిలిచిందని ఆమె తెలిపారు.

కంటైనర్ టెర్మినల్ మూసేస్తే బతుకులు రోడ్డుపాలు !

- ఉద్యోగులు, కార్మికుల వెల్లడి


మాట్లాడుతున్న ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు

ముత్తుకూరు, జనవరి 24 : అదానీ కృష్ణపట్నం పోర్టులో కంటైనర్ టెర్మినల్ మూసివేస్తే సుమారు పది వేలమంది బతుకులు రోడ్డుపాలవుతాయని ఆధారిత కంపెనీల ఉద్యోగులు, కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం కంటైనర్ టెర్మినల్‌పై ఆధారపడి జీవనం సాగిస్తున్న కంపెనీ ఉద్యోగులు, కార్మికులు ఏకమై కంటైనర్ టెర్మినల్ తరలిపోకుండా నిలుపుకునేందుకు కార్యాచరణ ప్రణాళిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు పోర్టులోని గోపాలపురంలో మీడియాతో మాట్లాడుతూ ఉద్దేశపూర్వకంగానే కంటైనర్ టెర్మినల్‌ను అదానీ కృష్ణపట్నం పోర్టు నుంచి చెన్నైకి తరలిస్తున్నారని, దీంతో ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాదిమంది జీవనోపాధి కోల్పోతామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అదానీ కృష్ణపట్నం పోర్టులో కంటైనరల్ టెర్మినల్ కార్యకలాపాలను కొనసాగించాలని కృష్ణపట్నం కస్టమ్స్ అదనపు కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తామన్నారు. ఎన్నూరు, కట్టుపల్లి, గంగవరం ఓడరేవుల్లో కంటైనర్ టెర్మినల్స్‌ను అభివృద్ధి చేయాలనుకుంటున్నారని, అందుకే నెమ్మదిగా ఓడలను ఈ టెర్మినల్స్‌కు మళ్లించారని వారు చెప్పారు.

- **సోమిరెడ్డికి వినతి**

కృష్ణపట్నం పోర్టు కంటైనర్ టెర్మినల్‌ను కాపాడాలని కంటైనర్ టెర్మినల్ ఉద్యోగులు, కార్మికులు అల్లీపురంలో బుధవారం మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. కాగా సర్వేపల్లి నియోజకవర్గం జనసేన ప్రతినిధి బొబ్బేపల్లి సురేష్‌నాయుడు, తదితరులు కంటైనర్ టెర్మినల్ ఉద్యోగుల ఉద్యమానికి మద్దతు పలికారు.

రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యం

- నగరంలో సిగ్నల్స్, హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయాలి
- రోడ్డు భద్రత కమిటీ సమావేశంలో కలెక్టర్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జనవరి 24: రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా అవసరమైన రోడ్డు భద్రత చర్యలు సకాలంలో చేపట్టాలని కలెక్టర్ ఎం హరినారాయణన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో బుధవారం రోడ్డు భద్రత కమిటీ సమావేశం ఆయన అధ్యక్షతన జరిగింది. రోడ్డు ప్రమాదాల నివారణకు చేపడుతున్న కార్యక్రమాలను డీటీసీ చందర్ వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ నగరంలోని అన్ని ప్రధాన కూడళ్లను క్షుణ్ణంగా పరిశీలించి సిగ్నల్స్, హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. హైవేపై నిత్యం ప్రమాదాలు జరుగుతున్న బుజబుజ నెల్లూరు, మనుబోలు సమీపంలోని బద్వేల్ క్రాస్‌రోడ్డు వద్ద ప్రమాదాల నివారణకు లైట్లు బ్లింకింగ్ చేయడం, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం వంటివి చేపట్టాల ఆదేశించారు. నగరంలోని ట్రాఫిక్ పోలీసులకు జాకెట్లు, గ్లౌజ్‌లు, ఎయిర్ ప్యూరిఫయర్లను అందించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే గోల్డెన్ అవర్‌లో బాధితుడికి సహాయ సహకారులు అందించి కాపాడిన వారికి ప్రోత్సాహకంగా గుడ్ సమారిటన్ అవార్డు కింద రూ.5వేలు నగదు బహుమతి, సర్టిఫికెటు అందజేయాలని, దీనిపై విస్తృతంగా ప్రచారం చేయాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. రిపబ్లిక్‌డే రోజున ఇద్దరికి ఈ అవార్డు అందించేలా చర్యలు చేపట్టాలని డీటీసీ చందర్‌ను ఆదేశించారు. ఎస్పీ డాక్టర్ కే తిరుమలేశ్వర రెడ్డి మాట్లాడుతూ పొదలకూరు-రాపూరు, రాపూరు-నెల్లూరు, మర్రిపాడు-ఆత్మకూరు రహదారిపై సమీప గ్రామాల ప్రజలు పశువులను రోడ్లపై వదులుతున్నారని, దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఈ సమావేశంలో నేషనల్ హైవేస్ పీడీ దేవేష్ గోయల్, ట్రాఫిక్ డీఎస్పీ సుబహాన్, ఎన్‌హెచ్ ఆర్‌అండ్‌బీ డీఈఈ అనిల్ కుమార్‌రెడ్డి, ఆర్డీవో సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫైర్ సిబ్బందికి రెస్క్యూ కోడ్ డ్రస్


రెస్క్యూ కోడ్ డ్రస్ అందుకున్న సిబ్బందితో ఏడీఎఫ్‌వో

నెల్లూరు(క్రైం), జనవరి 24 : నెల్లూరు ఫైర్ స్టేషన్‌లో విధులు నిర్వహించే 36 మంది సిబ్బందికి ఏడీఎఫ్‌వో వేణుగోపాల్ సొంత నిధులతో టీషర్ట్, లోయర్, షర్ట్‌తో కూడిన రెస్క్యూ కోడ్ డ్రస్‌ను అందించారు. బుధవారం నెల్లూరులోని ఫైర్ స్టేషన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వరదలు, తుఫాన్లు సంభవించినప్పుడు ఫైర్ సిబ్బంది రెస్క్యూ విధులు నిర్వహిస్తుంటారని, సమయంలో కోడ్ డ్రస్‌ను ధరించి సహాయక చర్యలు చేపడితో బాగుంటుందన్న ఉద్దేశంతో దుస్తులు అందజేసినట్లు తెలిపారు.

ఆర్టీసీ బస్టాండులో 'హ్యాపీ డ్రైవర్స్ డే'

నెల్లూరు(క్రైం), జనవరి 24: ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుస్తున్న డ్రైవర్లను అభినందిస్తూ జిల్లా వ్యాప్తంగా అన్ని ఆర్టీసీ బస్టాండ్లలో బుధవారం హ్యాపీ డ్రైవర్స్ డే నిర్వహించారు. నగరంలోని ఆర్టీసీ ప్రధాన బస్టాండులో డీఎం మురళీకృష్ణ విధులకు హాజరవుతు న్న డ్రైవర్లపై రోజా పువ్వులు చల్లుతూ సంతోషంగా డ్యూటీకి వెళ్లి రావాలని ఆశీర్వదించారు. ఆత్మకూరు బస్టాండులో జరిగిన కార్యక్రమానికి ఏపీ హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి, ట్రాఫిక్ ఎస్ఐ శివ శంకర్ అతిథులుగా హాజరయ్యారు. ప్రయాణికులను సురక్షితంగా గమ్య స్థానాలకు చేరుస్తున్న డ్రైవర్లను అభినందించారు.

జనసేన కార్యాలయానికి టీడీపీ నేతలు



జనసేన పార్టీ కార్యాలయం వద్ద టీడీపీ, జనసేన నాయకులు

నెల్లూరు(స్టోన్‌హౌస్ పేట),జనవరి 24: నగరంలోని జనసేన పార్టీ జిల్లా కార్యాలయానికి బుధవారం టీడీపీ ముఖ్య నేతలు వెళ్లారు. జనసేన జిల్లా అధ్యక్షుడు చెన్నారెడ్డి మనుక్రాంత్ రెడ్డి, నగర అధ్యక్షుడు దుగ్గిశెట్టి సుజయ్‌బాబు టీడీపీ నేతలకు సాదరంగా స్వాగతం పలికారు. రాబోయే ఎన్నికల్లో ఉమ్మడి అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా చేపట్టాల్సిన కార్యాచరణపై చర్చించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, జాతీయ ప్రధాన కార్యదర్శి బీదా రవిచంద్ర, నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో ప్రభుత్వం విఫలం : ధర్మవరం

నెల్లూరు (వైద్యం), జనవరి 24 : వైసీపీ ప్రభుత్వం అన్ని రంగాల్లో వైఫల్యం చెందిందని టీడీపీ బీసీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధర్మవరం సుబ్బారావు విమర్శించారు. బుధవారం నగరంలోని 47, 48 డివిజన్లలో బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. అన్ని వర్గాలను సీఎం జగన్మోహన్ రెడ్డి మోసం చేశారని దుయ్యబట్టారు. యువగళం పేరుతో లోకేష్ యువతరంలో చైతన్యం తీసుకువచ్చారన్నారు. ఓ న్యాయమూర్తికి రూ.రెండు కోట్ల విలువైన వజ్రాల వాచ్ కానుకగా పంపించారంటే వ్యవస్థలను జగన్ ఎలా మేనేజ్ చేస్తున్నారో తెలుస్తుందన్నారు. నగరంలో పొంగూరు నారాయణను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గణేష్ పాల్గొన్నారు.

జంతు సంక్షేమం సామాజిక బాధ్యత

- జిల్లా పశువైద్యాధికారి మహేశ్వరుడు

నెల్లూరు(వ్యవసాయం), జనవరి 24 : జంతు సంక్షేమాన్ని సామాజిక బాధ్యతగా భావించాలని, మూగజీవాలపై ప్రతి ఒక్కరూ ప్రేమాభిమానాలు కలిగి ఉండాలని జిల్లా పశువైద్యాధికారి మహేశ్వరుడు కోరారు. నగరంలో రైల్వేఫీడర్సురోడ్డులోని పశుసంవర్ధకశాఖ కార్యాలయంలో బుధవారం జంతు హింస నివారణ సంస్థ కమిటీ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ ఈనెల 14 నుంచి 30వతేదీ వరకు జంతు సంక్షేమ పక్షోత్సవాలు నిర్వహిస్తున్నా మని తెలిపారు. పశుపక్ష్యాదులను హింసించడం చట్టరీత్యా నేరమన్నారు. రోడ్లపై పశువులను వదలడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని, పశు యజమానులు నిబంధనలు పాటించాలని సూచించారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులైన క్రైం డీఎస్పీ శివాజీ రాజా, డిప్యూటీ ఈవో లక్ష్మి, ఎంవీఐ మురళీమోహన్, వైద్యులు మధులత, యశోద, జయచంద్ర, ఉమాదేవి, కన్నన్, మాలకొండయ్య, జయప్రకాష్ పాల్గొన్నారు.

బాలికలు విద్యలో రాణించాలి : జడ్జి వాణి

నెల్లూరు (విద్య), జనవరి 24 : బాలికలు అవకాశాలను అందిపుచ్చుకుని విద్యలో ఉత్తమంగా రాణించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కే వాణి సూచించారు. జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా నగరంలోని దర్గామిట్ట జడ్పీ బాలికోన్నత పాఠశాలలో బుధవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడు తూ బాలలు వారి హక్కులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డాక్టర్ ఖాదర్‌వలి మాట్లాడుతూ లింగ నిష్పత్తి అసమానతలు లేకుండా జిల్లాలో పీసీపీఎన్‌డీటీ చట్టాన్ని సమర్థవంగా అమలు చేస్తున్నామని, లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం బాలికలకు పలు రకాల ఆటల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ బీ హేన సుజన్, డీసీపీవో సురేష్, దిశా సీఐ రామారావు, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ మాధవి తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ పారామెడిక్స్ డైరీ ఆవిష్కరణ


డైరీ ఆవిష్కరిస్తున్న రవిచంద్ర, డాక్టర్ శివప్రసాద్ తదితరులు

నెల్లూరు (వైద్యం), జనవరి 24 : కమ్యూనిటీ పారామెడికల్ వెల్ఫేర్ అసోసియేషన్ గ్రామీణ వైద్యుల 2024 నూతన సంవత్సర డైరీని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర బుధవారం ఆవిష్కరించారు. రవిచంద్ర నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో టీడీపీ వైద్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జెడ్ శివప్రసాద్, కమ్యూనిటీ పారామెడికల్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఖాజామియా, వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ షేక్ సిరాజ్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ వీఎల్ నారాయణరావు, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు సుకన్య తదితరులు పాల్గొన్నారు.

చాగణం గౌరీశంకర్‌కు జీవిత సాఫల్య పురస్కారం


జీవిత సాఫల్య పురస్కారం అందుకుంటున్న గౌరీ శంకర్

నెల్లూరు (సాంస్కృతికం), జనవరి 24 : పెళ్లకూరుకు చెందిన చాగణం లలితమ్మ, బాస్కర్‌రావు మెమోరియల్ ట్రస్ట్ ద్వారా నిర్వహిస్తున్న వివిధ రకాల సేవా కార్యక్రమాలకు గుర్తింపుగా ట్రస్ట్ అధినేత చాగణం గౌరీశంకర్‌కు బుధవారం సేవారత్న జీవిత సాఫల్య పురస్కారం ప్రదానం చేశారు. టౌనుహాలులో జరిగిన ఈ కార్యక్రమానికి 25 కళా సంఘాల అధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి అధ్యక్షత వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. గౌరీశంకర్ మాట్లాడుతూ ఈ అవార్డులు తనకు బాధ్యత పెంచాయన్నారు. ఈ కార్యక్రమాన్ని ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో షేక్ ఖాదర్‌వలీ, 25 కళా సంఘాల కన్వీనర్లు దోర్నాల హరిబాబు, అమీర్‌జాన్ తదితరులు పర్యవేక్షించారు.

రమణీయం రంగనాథ కల్యాణం

నెల్లూరు (సాంస్కృతికం), జనవరి 24 : హిందూ ధర్మ ప్రచారంలో భాగంగా భక్తుల వద్దకు భగవంతుడు కార్యక్రమం వారోత్సవాల్లో బుధవారం రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథస్వామి కల్యాణం కనుల పండువగా జరిగింది. పెద్దబజారు సెంటర్‌లో జరిగిన ఈ కార్యక్రమాన్ని ఆలయ అర్చకుడు కిడాంబి జగన్నాథచార్యులు ఆధ్వర్యంలో అర్చకస్వాములు నిర్వహించారు. చిన్నారుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, ధర్మకర్తలు పర్యవేక్షించారు. తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో గురువారం పౌర్ణమి సందర్భంగా ఉదయం 9గంటలకు మహా సుదర్శన హోమం జరుగుతుందని ఈవో వెంకటేశ్వర్లు ఓ ప్రకటనలో తెలిపారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం

నెల్లూరు(సాంస్కృతికం), జనవరి 24 : నగరంలోని విరాట్ నగర్ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో మూలస్థానేశ్వరస్వామి ఆలయం ఆధ్వర్యంలో బుధవారం శివపార్వతుల కల్యాణం వైభవంగా జరిగింది. భక్తుల వద్దకు భగవంతుడు కార్యక్రమ వారోత్సవాల్లో భాగంగా ఈ ఉత్సవం జరిగింది. తొలుత మూలస్థానేశ్వరస్వామికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, అనంతరం కల్యాణం, సాంస్కృతిక ప్రదర్శనలు జరిగాయి. ఆయా ఆలయాల దర్మకర్తలు, భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు శివానందలహరి ప్రవచనం

నగరంలోని పొగతోట ఆదిశంకర ధ్యాన మందిరంలో గురువారం శివానందలహరి ప్రవచనం జరుగుతుందని చక్రాలవారి ట్రస్ట్ మేనేజర్ స్వామి సమయానందనాథ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పుష్య మాస పౌర్ణమి నాడు శంకర భగవత్పాదులవారు శృంగేరిలో దక్షిణామ్నాయ శారదాపీఠం, బదరీనాథ్‌లో ఉత్తరామ్నాయ జ్యోషి మఠం స్థాపన చేశారని తెలిపారు. ఈ సందర్భంగా సాయంత్రం 6 నుంచి 7.30గంటల వరకు శివానందలహరిపై గుడ్లదొన వరప్రసాదరావు ప్రవచిస్తారని తెలిపారు.

వాకర్స్‌కు వైద్య పరీక్షలు

నెల్లూరు (విద్య), జనవరి 24 : నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం వాకర్స్‌కు వైద్య పరీక్షలు నిర్వహించారు. అసోసియేషన్ కార్యదర్శి గుర్రం వెంకట సురేంద్రబాబు మాట్లాడుతూ ప్రతినెలా వైద్యపరీక్షలు, వైద్య అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు దాసరి అనంత రామారావు, కోశాధికారి అరిగెల సాయిరాం, గౌరవాధ్యక్షుడు కిలారి తిరుపతి నాయుడు, మాజీ అధ్యక్షుడు వేలూరి రంగారావు పాల్గొన్నారు.

నేడు జర్నలిస్ట్ భవన్ ప్రారంభం

నెల్లూరు (వైద్యం), జనవరి 24 : నగరంలోని పెద్దబజార్ ఉమామహేశ్వర ఆలయం సెంటర్ వద్ద గురువారం నూతన జర్నలిస్ట్ భవనాన్ని ప్రారంభిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ మీడియా ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున తెలిపారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. జర్నలిస్ట్ యూనియన్లకు అతీతంగా ఈ భవనం ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు.

యువకుడి ఆత్మహత్య

నెల్లూరు(క్రైం), జనవరి 24: నగరంలోని ఉమ్మారెడ్డి గుంటలో ఓ యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసు సమాచారం మేరకు... మధ్యప్రదేశ్ రాష్ట్రం సిద్ధి జిల్లా గోదాహి గ్రామానికి చెందిన రవి కుష్వా కొంత కాలంగా నెల్లూరు వనంతోపు సెంటర్‌లోని ఓ టీ దుకాణంలో మాస్టర్‌గా పనిచేస్తున్నాడు. అతని స్వస్థలానికి చెందిన రామకిషోర్ కుష్వా(23) ఉపాధి నిమిత్తం తొమ్మిది రోజుల కిందట నెల్లూరుకు వచ్చి రవి కుష్వాను కలిశాడు. ఆయన తాను పనిచేస్తున్న టీ దుకాణంలోనే రామకిశోర్‌కు పని ఇప్పించారు. తనతో పాటు ఉమ్మారెడ్డిగుంటలోని తన గదిలోనే ఉంచుకున్నాడు. ప్రతి రోజు ఇద్దరూ కలిసి దుకాణానికి వెళ్లి పనులు చూసుకుని తిరిగి వచ్చేవారు. ఈ నేపథ్యంలో బుధవారం రామ కిశోర్ కుష్వా కాసేపటి తర్వాత వస్తానని చెప్పడంతో రవి కుష్వా దుకాణానికి వెళ్లిపోయాడు. అనంతరం రామకిశోర్ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఎంతసేపటికీ రామకిషోర్ దుకాణానికి రాకపోవడంతో రవి కిషోర్ వచ్చి తలుపులు కొట్టగా తలుపు తీయకపోవడంతో తన యజమానికి విషయం తెలియజేశాడు. అందరూ కలిసి తలుపులు పగులగొట్టి చూడగా రామకిశోర్ ఉరికి వేలాడుతూ కనిపించాడు. వేదాయపాళెం పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్ఐ అంకమ్మ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. రామకిశోర్ కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు.

కానిస్టేబుల్ కుటుంబానికి సాయం

నెల్లూరు(క్రైం), జనవరి 24: అకాల మరణం చెందిన సహచర కానిస్టేబుల్ ఎం రవి కుటుంబాన్ని తోటి బ్యాచ్ సహోద్యోగులు ఆదుకోవడం అభినందనీయమని ఎస్పీ డాక్టర్ కే తిరుమలేశ్వరరెడ్డి ప్రశంసించారు. సంతపేట పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ అకాల మరణం చెందిన రవి కుటుంబం పేరున సహోద్యోగులు అందరూ కలిసి రూ.2.1 లక్షల నగదును ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి బాండును బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ ద్వారా రవి భార్య శిరీషకు అందించారు. కార్యక్రమంలో అడ్మిన్ ఏఎస్పీ సౌజన్య, 2009 బ్యాచ్ పోలీసులు పాల్గొన్నారు.

హలో ... ఓటెవరికి వేస్తారు?



● ఫోన్ కాల్స్‌తో విసిగిపోతున్న జనం

డక్కిలి, జనవరి 24 : ఇంకా ఎన్నికల నోటిఫికేష్ విడుదల కాలేదు...ప్రధాన పార్టీల నుంచి పోటీచేసే అభ్యర్థులు ఎవరన్నది కూడా ప్రకటించకపోయినా ఫోన్ ద్వారా సర్వేల పేరుతో మొబైల్ ఫోన్లలో వినిపిస్తున్న ప్రశ్నల వర్షంతో జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. మరి కొందరైతే ఫోన్ చేసిన వారితో గొడవకు సైతం దిగుతున్నారు. హలో మీ ఓటెవరికి వేస్తారండి అని మొదలెట్టి మీ వయసెంత ?, మీదే కులం?, ఫలానా వ్యక్తికి ఎందుకు ఓటు వేయడం లేదు?, ఆయన పని తీరు మీకు నచ్చలేదా ? నచ్చకపోతే ఎందుకు నచ్చలేదు? వలంటీరు పనితీరు ఎలా వుంది ? మీకు రేషన్ అందుతోందా? అంటూ సవాలక్ష ప్రశ్నలు గుప్పిస్తున్నారు. రోజూ ఇలాంటి కాల్స్ ఒకటి కాదు రెండు కాదు ఏడెనిమిది వరకూ వస్తున్నాయని ఓటర్లు చెబుతున్నారు. కొన్ని సర్వే సంస్థలైతే ఫోన్లకు వీడియో సందేశాలు పంపుతున్నాయి. బిజీ సమయాల్లో కొత్త నెంబర్ల నుంచి వచ్చే ఫోన్ కాల్స్ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు చేశారేమోనని లిఫ్ట్ చేసేసరికి ప్రచార సమాచారం విని ఏమీ మాట్లాడకుండా కట్ చేసేస్తున్నారు. మరి కొందరైతే నియోజకవర్గం పేరు చెప్పి త్వరలో జరిగే ఎన్నికల్లో అభ్యర్థుల పేర్లు కాకుండా పార్టీ పేర్లు చెప్పి మీరే పార్టీకి ఓటేస్తారని అడుగుతున్నారు. కొంతమంది నాయకులు తమకు టికెట్ వస్తే గెలుస్తామో లేదో అని కూడా సర్వేల ద్వారా ముందే తెలుసుకొనే ప్రయత్నం చేస్తున్నారు. వెంకటగిరి నియోజవర్గంలో ఓ పార్టీ తరపున ఇప్పటికే అన్ని గ్రామాల్లో సర్వే బృందాలు దిగి సర్వేలు మొదలు పెట్టాయని సమాచారం.

సచివాలయాల్లో వైసీపీ నేతల మీటింగులు

సిబ్బందికి,వలంటీర్లకు ఎన్నికల్లో ఎలా పనిచేయాలో పాఠాలు



ఏర్పేడు, జనవరి 24 : సచివాలయాలను వైసీపీ నాయకులు పార్టీ ప్రచార కేంద్రాలుగా వాడుకుంటున్న వైనం ఏర్పేడు మండలంలో బుధవారం బయటపడింది.మండలంలో 19సచివాలయ కేంద్రాలుండగా వాటిలో 13కేంద్రాల్లో అధికార పార్టీకి చెందిన కొంతమంది నాయకులు బుధవారం సచివాలయ సిబ్బందికి, వలంటీర్లకు వచ్చే ఎన్నికల్లో చేయాల్సిన పనుల గురించి సూచనలిచ్చారు.ఈ విషయాన్ని ఈవో పీఆర్డీ చెప్పినట్లుగా ముందు రోజే ఓ పంచాయతీ అధికారి సచివాలయ డీడీవోలకు, వలంటీర్లకు వాయిస్ మెసేజ్ పంపాడు. అంతే కాకుండా ఏ సచివాలయానికి ఎంత సమయానికి వైసీపీ నాయకులు వస్తారో కూడా తెలియపరిచాడు.ఆ సమయానికి వలంటీర్లతో సచివాలయ సిబ్బంది సిద్ధంగా ఉండాలని వాయిస్ మెసేజ్‌లో సూచించారు. అదే ప్రకారం బుధవారం వైసీపీ నాయకులు 13 సచివాలయాల్లో సమావేశాలు ఏర్పాటు చేసుకుని ఎన్నికల్లో పనిచేయాల్సిన తీరును, ప్రజలకు చెప్పాల్సిన అంశాలను వివరించారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తమ ఫోన్లు స్విచ్ఛాఫ్ చేసి ఒక దగ్గర ఉంచాలని ఆదేశించి మరీ కార్యక్రమాన్ని ప్రారంభించారు.వచ్చే ఎన్నికల్లో వైసీపీ కోసం పనిచేయకపోతే ఉద్యోగాలుండవని చెప్పినట్లు సమాచారం. ఈ ప్రచార కార్యక్రమాలను పార్టీ కార్యాలయాల్లో నిర్వహిస్తే బాగుంటుందని ఈ సందర్భంగా సచివాలయ సిబ్బంది వైసీపీ నాయకులకు సూచించినట్లు తెలిసింది.

ఎడ్యుకేషన్ సమ్మిట్‌లో సీఎం

రాజకీయ అంశాలపైనా స్పందించిన జగన్

తిరుపతి (నేరవిభాగం), జనవరి 24 : నాణ్యమైన విద్య పొందే హక్కు ప్రతి ఒక్కరికీ వుండాలని సీఎం జగన్ అభిప్రాయపడ్డారు.తిరుచానూరు సమీపంలోని తాజ్ హోటల్‌లో ఇండియా టుడే మీడియా సంస్థ నిర్వహించిన ఎడ్యుకేషన్ సమ్మిట్-2024 కార్యక్రమానికి సీఎం ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ జాతీయ స్థాయి విద్యాసమ్మేళనానికి రెండవరోజైన బుధవారం సాయంత్రం జగన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తాజ్ హోటల్‌కు సాయంత్రం 4.50 గంటలకు చేరుకున్న జగన్ రాష్ట్రంలో విద్యా విధానం గురించిన చర్చలో ప్రముఖ జర్నలిస్టు రాజ్‌దీప్ సర్దేశాయ్‌తో కలిసి పాల్గొన్నారు. విద్యారంగంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను, సంస్కరణలను ఆయన ఎడ్యుకేషన్ సమ్మిట్ వేదికపై వివరించే ప్రయత్నం చేశారు.కాకపోతే విద్యావిధానం గురించిన చర్చకు మాత్రమే పరిమితం కావాల్సిన వేదికపై ప్రముఖ జర్నలిస్టు రాజ్‌దీప్ సర్దేశాయ్ వేసిన ప్రశ్నలకు స్పందిస్తూ రాజకీయ అంశాలపైనే అధికంగా మాట్లాడడం చర్చనీయాంశమైంది.అనంతరం 6.33గంటలకు ఆయన తిరుగుప్రయాణమయ్యారు. విమానాశ్రయంలో మంత్రులు నారాయణస్వామి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రోజా తదితరులతో పాటు ఎమ్మెల్యేలు,వైసీపీ ప్రముఖులు సాదర స్వాగతం, వీడ్కోలు పలికారు.



ఎడ్యుకేషన్ సమ్మిట్ వేదికపై సీఎం జగన్‌తో జర్నలిస్టు రాజ్‌దీప్ సర్దేశాయ్



సీఎం కారులో ఇరుక్కుని కలెక్టర్ ప్రయాణం

తిరుపతి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) :సీఎం జగన్ బుధవారం రేణిగుంటలోని విమానాశ్రయం నుంచీ తిరుపతిలోని తాజ్ హోటల్‌కు వచ్చేటపుడు, తిరిగి వెళ్ళేటపుడు రెండుసార్లూ కలెక్టర్ వెంకట్రమణారెడ్డి సీఎం కారులోనే ఇరుక్కుని కూర్చుని ప్రయాణించడం కనిపించింది. ముందు సీట్లో సీఎం కూర్చుని వుండగా వెనుక సీటులో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకర రెడ్డి, సెక్యూరిటీ ఆఫీసర్ కూర్చున్నారు. కలెక్టర్ కూడా ప్రయాణించడంతో వెనుక సీట్లో ఇరుకైంది. దీంతో ఆయన టీటీడీ ఛైర్మన్, మంత్రి పెద్దిరెడ్డి ఒళ్ళో కూర్చున్న చందంగా ఇరుక్కుని ప్రయాణించడం కనిపించింది. సీఎం కాన్వాయ్‌లో పలు వాహనాలు అందుబాటులో వుండడంతో పాటు కలెక్టర్‌కు సొంత వాహనం కూడా వున్నప్పటికీ సీఎం కారులో అంతగా ఇరుక్కుని వెళ్ళాల్సిన అవసరమేమిటన్న ప్రశ్న ఎదురవుతోంది. కాన్వాయ్‌లో ఈ దృశ్యం చూసిన వారంతా దీనిపైనే చర్చించుకోవడం కనిపించింది. అయితే తిరుపతి లోక్‌సభ ఉప ఎన్నికల్లో చోటుచేసుకున్న అక్రమాలపై కేంద్ర ఎన్నికల సంఘం కన్నెర్ర చేయడం, పలువురు అధికారులపై ఇప్పటికే చర్యలు తీసుకున్న నేపథ్యంలో ప్రధానంగా ఆ అంశంపై సీఎం కారులో చర్చ జరిగివుంటుందన్న ఊహాగానాలు వ్యక్తమవుతున్నాయి.

'సిద్ధం!' అంటూ ఫ్లెక్సీలు పెట్టి ఇంత భయమెందుకు?

● సీఎంను అడ్డుకుంటామని చెప్పకున్నా మమ్మల్ని గడపదాటనివ్వరా?

● టీడీపీ, జనసేన నేతల మండిపాటు

తిరుపతి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): సీఎం జగన్ పర్యటనను అడ్డుకుంటామని ప్రతిపక్ష పార్టీలేవీ ప్రకటించకపోయినా నాయకులను గృహనిర్బంధంలో వుంచడం విమర్శలపాలైంది.బుధవారం తెల్లవారకముందే టీడీపీ, జనసేన నాయకుల ఇళ్ల ముందు పోలీసులు ప్రత్యక్షమయ్యారు. గడపదాటనీయకుండా కాపలాకాశారు. మీడియా సమావేశాలకు వెళ్లాలని మొత్తుకున్నా ఎస్కార్ట్‌లాగా వెంబడించారు. సాయంత్రం 4 గంటలపైన సీఎం పర్యటన ఉంటే ఉదయం 6 గంటలనుంచే ప్రతిపక్ష నాయకులను హౌస్ అరెస్టు చేశారు. తిరుపతిలో మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణతో పాటు జనసేన నాయకులు కిరణ్ రాయల్, రాజా రెడ్డిలను గృహనిర్బంధం చేశారు. సాయంత్రం 6 గంటలపైన సీఎం వెళ్లిపోయాకే విడిచిపెట్టారు.ఈ సందర్భంగా సుగుణమ్మ,ఆర్సీ మునికృష్ణ మాట్లాడుతూ జగన్ రెడ్డిని అడ్డుకుంటామని తాము చెప్పనప్పుడు ప్రివెంటివ్ అరెస్టులు ఎందుకు చేస్తున్నారో అర్థం కాని పరిస్థితి నెలకొందన్నారు. తిరుపతిలో ప్రతిపక్షమే లేదని భూమన అభినయ్ రెడ్డి, ఇతర వైసీపీ నేతలు ప్రగల్భాలు పలుకుతుంటే తమ నాయకుల ఇళ్ల వద్దకు పోలీసులను ఎందుకు పంపారో అర్థం కావడంలేదన్నారు. వైసీపీ దుర్మార్గపు పాలనకు ఇదొక నిదర్శనమని మండిపడ్డారు.


ఇంటిముందున్న పోలీసులతో సుగుణమ్మ వాగ్వాదం

● 'సిద్ధం.!' అంటూ ఫ్లెక్సీలు పెట్టి...

ఎన్నికల యుద్ధానికి 'సిద్ధం' అన్నట్టుగా జగన్మోహన్ రెడ్డి ఫొటోలతో పెద్దపెద్ద ఫ్లెక్సీలు రాత్రికి రాత్రే తిరుపతి నగరమంతా పెట్టేశారు. ఫ్లెక్సీల్లో మాత్రం సిద్ధం.! అంటూ సవాల్ విసిరి, ప్రతిపక్షాలను గడప దాటనీయకుండా అడ్డుకున్నారు. 'ఆయనేమో సిద్ధం అంటూ వేలు చూపిస్తున్నాడు. మీరేమో మమ్మల్ని బయటకు రావొద్దు అంటున్నారు' అంటూ సుగుణమ్మ పోలీసులనుద్దేశించి చమత్కరించారు.



'సిద్ధం..!' అంటూ తిరుపతిలో వెలసిన ఫ్లెక్సీలు

వైసీపీలో ఒక వర్గం రోజా ప్రతిష్టను దిగజారుస్తోంది : మున్సిపల్ ఛైర్మన్

తిరుపతి(తిలక్‌రోడ్), జనవరి 24: నగరి నియోజకవర్గ వైసీపీలో ఒక వర్గం పనిగట్టుకుని మంత్రి రోజా ప్రతిష్టను దిగజారుస్తోందని పుత్తూరు మున్సిపల్ ఛైర్మన్ హరి తెలిపారు.వైస్ ఛైర్మన్ శంకర్,కొందరు కౌన్సిలర్లతో కలిసి తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. రోజా రాజకీయ ఎదుగుదలను చూసి ఓర్వలేక చేస్తున్న దుష్ప్రచారంలో భాగంగానే కౌన్సిలరు భువనేశ్వరి ఆరోపణలు చేసిందన్నారు. సత్య అనే వ్యక్తి అప్పు తీసుకుంటే మంత్రికి ఏమి సంబంధమని ప్రశ్నించారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో ఒక వర్గం చేస్తున్న కుట్రే ఇది అన్నారు. ఆ వర్గం పేర్లు చెప్పాలని విలేకరులు అడగ్గా నీళ్లు నమిలారు.కౌన్సిలరు భువనేశ్వరి వద్ద డబ్బు తీసుకున్న సత్య మాట్లాడుతూ తాను వ్యాపార లావాదేవీల్లో భాగంగా రూ.29లక్షలు తీసుకున్నానని, ఇప్పటికే రూ.16లక్షలు చెల్లించానని, మిగిలిన బాకీ చెల్లించేలోపు మంత్రిపై అభాండాలు మోపారని తెలిపారు.

మంత్రి రోజాను బర్తరఫ్ చేయాలి : గాలి

పుత్తూరు అర్బన్, జనవరి 24: దళిత మహిళా కౌన్సిలర్‌కు మున్సిపల్ ఛైర్మన్ పదవి ఇస్తానని చెప్పి రూ.40 లక్షలకుపైగా దోచుకున్న రోజాను వెంటనే మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని నగరి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గాలి భానుప్రకాశ్ డిమాండు చేశారు. పుత్తూరులో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. సీఎం జగన్‌కు దళితుల పట్ల ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా కౌన్సిలర్ భువనేశ్వరికి న్యాయంచేయడంతో పాటు మొత్తం వ్యవహారంపై విచారణ జరిపించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. మంత్రి రోజా అవినీతి గురించి తెలిసి నియోజకవర్గంలోని మహిళలు ఈసడించుకుంటున్నారని మండిపడ్డారు.నియోజకవర్గంలోని ఇసుక, గ్రావెల్, మట్టి, కంకరను రాష్ట్ర సరిహద్దులు దాటించి ప్రజల సొమ్మును దోచుకున్నారని దుయ్యబట్టారు.

మిస్టరీగా మహిళ మృతి!


పవిత్ర మృతదేహం

● ముక్కంటి ఆలయ సమీపంలో కలకలం

● బహిర్భూమి కోసం స్వర్ణముఖి నదిలోకి వెళ్ళిన దంపతులు

● నీటిలో పడడంతో చనిపోయిందంటూ భర్త గగ్గోలు

శ్రీకాళహస్తి, జనవరి 24: ఆ దంపతుల మధ్య అనుమానం చిచ్చు రేపింది. తరచూ భార్యను నిందిస్తూ భర్త వేధించేవాడు. 13 రోజుల క్రితం కూడా ఆగ్రహంతో భార్యపై దాడి చేసి గాయపరిచాడు.తిరుపతిలోని ఒక వైద్యశాలలో ఆమె చికిత్స పొంది బుధవారం సాయంత్రం డిశ్చార్జి అయింది.ముక్కంటిని దర్శించుకుని ఇంటికి వస్తానని భర్త అందరికీ చెప్పాడు. ఆ ప్రకారం భార్యను వెంటబెట్టుకుని శ్రీకాళహస్తికి వచ్చాడు. స్వర్ణముఖి నదిలో ఆమెని బహిర్భూమి కోసం అంటూ వెంట తీసుకెళ్లాడు. కాసేపటి తర్వాత తన భార్య నీటిలో పడి అక్కడికక్కడే మృతి చెందిందంటూ గగ్గోలు పెట్టాడు. భర్త ప్రవర్తన, ఘటన జరిగిన తీరు ఎన్నో అనుమానాలను రేకెత్తించింది. మహిళ మృతి మిస్టరీగా మిగిలిపోయింది. మృతురాలి కుటుంబ సభ్యుల కథనం మేరకు... వరదయ్యపాలెం మండలం పద్మావతిపురం ప్రాంతానికి చెందిన శ్రీనివాసులు (55) లారీ డ్రైవర్‌గా పనిచేస్తుంటాడు. మొదటి భార్య కూతురు పుట్టిన తర్వాత అనారోగ్యంతో మృతి చెందడంతో తర్వాత పవిత్ర అలియాస్ దేవిక (36)ను రెండో వివాహం చేసుకున్నాడు. ఆమె ఓ సెల్‌ఫోన్ కర్మాగారంలో పనిచేస్తుండేది. 20 ఏళ్ల క్రితం వీరికి వివాహం జరిగింది.ఇంటర్ చదివే కొడుకు కూడా ఉన్నాడు. కొద్ది సంవత్సరాలుగా శ్రీనివాసులుకు అనుమానం మొదలైంది.భార్యను నిత్యం అనుమానిస్తూ గొడవపడేవాడు. పలుమార్లు పెద్దలు పంచాయితీ చేసి కాపురాన్ని నిలబెట్టారు. 13 రోజుల క్రితం భార్యాభర్తల మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో ఆగ్రహానికి గురైన శ్రీనివాసులు ఆమె తలపై దాడి చేయడంతో పవిత్ర గాయపడింది.కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం తిరుపతిలోని ప్రైవేట్ వైద్యశాలలో చేర్పించారు. తలలో రక్తం గడ్డ కట్టిందని చికిత్స అందించారు. పవిత్ర కోలుకున్నాక ఇకపై బాగా చూసుకుంటానని శ్రీనివాసులు బంధువులతో చెప్పాడు.దీంతో పవిత్ర డిశ్చార్జి అయ్యాక తర్వాత భర్తతో పాటు వెళ్ళమని వారు చెప్పారు.మొదట సెంటిమెంట్‌గా ముక్కంటి ఆలయాన్ని దర్శించుకుని ఒక్క రోజు క్షేత్రంలో నిద్ర చేసి ఆ తర్వాత ఇంటికి వెళ్తామని శ్రీనివాసులు అందరికీ చెప్పాడు. అదే ప్రకారం భార్యను వెంట బెట్టుకుని బుధవారం రాత్రి ముక్కంటి ఆలయ సమీపంలోని జల వినాయక కూడలి వద్దకు చేరుకున్నారు. ఆ తర్వాత బహిర్భూమి కోసం భార్యను వెంటబెట్టుకుని స్వర్ణముఖి నదిలోకి వెళ్లాడు. కాసేపటి తర్వాత తన భార్య నీటిలో పడడంతో చనిపోయిందంటూ బంధువులకు సమాచారం ఇచ్చాడు. అలాగే ఒడ్డుకు వెళ్లి అక్కడున్న వారికి విషయం చెప్పగా అంత చీకటి ప్రదేశంలోకి రాత్రివేళ భార్యను ఎందుకు తీసుకెళ్లావంటూ నిలదీశారు. ఈలోపు బంధువులు ఘటనా స్థలం వద్దకు చేరుకున్నారు. చాలాకాలం నుంచి భార్యాభర్తల మధ్య విభేదాలు ఉండడం... 13రోజుల క్రితం భార్యపై దాడి చేసిన విషయాన్ని ప్రస్తావిస్తూ విలపించారు. శ్రీనివాసులు చెబుతున్న మాటలన్నీ కట్టుకథలంటూ శ్రీకాళహస్తి 1వ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి శవాన్ని తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


విలపిస్తున్న పవిత్ర బంధువులు

హైస్కూల్ ప్లస్‌లో అటకెక్కిన ప్రాక్టికల్స్!



● ప్రతిపాదనలకే పరిమితమైన ప్రయోగశాలల ఏర్పాటు

● విద్యార్థినులకు శిక్షణ ఇవ్వకుండానే రెండు వారాల్లో పరీక్షలు ప్రారంభం

తిరుపతి(విద్య)జనవరి 24: ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థినులు దూరం వెళ్లకుండా తాము చదివిన హైస్కూల్లోనే ఇంటర్ చదివే అవకాశం కల్పించేందుకు ప్రభుత్వం రెండేళ్లక్రితం ఎంతో ఆర్భాటంగా మండలానికి ఒకటి చొప్పున హైస్కూల్ ప్లస్‌ని ప్రారంభించింది. మరో నలభై రోజుల వ్యవధిలో తొలిబ్యాచ్ విద్యార్థినులకు సంబంధించి ఇంటర్మీడియట్ కోర్సు పూర్తికానుంది. అయితే ఇప్పటికీ సైన్స్ కోర్సులు చదివే విద్యార్థినులకు ప్రధానమైన ల్యాబ్‌లను ఏర్పాటు చేయలేదు.దీంతో తొలిబ్యాచ్ సైన్స్ విద్యార్థినులు ప్రయోగశిక్షణ లేకుండానే వచ్చేనెల 5న ంచి జరిగే ప్రయోగపరీక్షలు రాయాల్సిన దుస్థితి ఎదురవుతోంది. ఈ ప్రయోగపరీక్షల మార్కులకు పబ్లిక్ పరీక్షల తరహా మార్కులతో సమ ప్రాధాన్యత ఉంటుంది. దీనిలో విద్యార్థులు మంచి మార్కులు సాధిస్తే పబ్లిక్ పరీక్షల్లో స్కోర్ కూడా మరింతగా పెరుగుతుంది. అలాగే ఉన్నతవిద్య ప్రవేశాల్లోనూ ఇంటర్‌మార్కులకు అత్యధిక ప్రాధాన్యత ఉంటోంది. విద్యార్థిదశలో వారికి సైన్స్‌పై ఆసక్తితో పాటు ప్రాక్టికల్ నైపుణ్యాలను పెంచేందుకు ఈ శిక్షణ ఎంతగానో దోహదం చేస్తుంది. ఈ నేపథ్యంలో ఎంపీసీ, బైపీసీ కోర్సుల్లో చేరిన విద్యార్థినులు ప్రయోగాలపై శిక్షణా తరగతులు చేపట్టకుండానే పరీక్షలకు సన్నద్ధం కావాల్సిరావడం విద్యార్థి, అధ్యాపకవర్గాలను ఆందోళనకు గురి చేస్తోంది. సబ్జెక్టులు బోధించే అధ్యాపకుల నియామకాలు కూడా ఈ విద్యా సంవత్సరం ప్రారంభమైన తర్వాత అరకొరగానే చేపట్టారు. దీంతో ఇక్కడ చదివే సైన్స్ గ్రూపుల విద్యార్థినులు ఫిబ్రవరిలో జరిగే ప్రాక్టికల్ పరీక్షలకు ఎలా సన్నద్ధం కావాలన్నది మిలియన్‌డాలర్ల ప్రశ్నగా మారింది. ఎంపీసీ విద్యార్థులకు ఫిజిక్స్, కెమిస్ట్రీలలో 30మార్కుల చొప్పున మొత్తం 60మార్కులకు, బైపీసీ విద్యార్థులకు బోటనీ, జువాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీలలో 30మార్కుల చొప్పున మొత్తం 120మార్కులకు ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహిస్తారు. వీటిలో మంచి మార్కులు వస్తే ..పబ్లిక్ పరీక్షల్లో స్కోర్ కూడా పెరుగుతుంది. ప్రయోగాల పరీక్షల ఫలితాల ప్రభావం పబ్లిక్ పరీక్షల ఫలితాల్లోనూ కనిపిస్తుంది. కాగా సమీపంలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, ఏపీఆర్‌జేసీ, ఆదర్శపాఠశాలలు, కేజీబీవీలకు విద్యార్థినులను తీసుకెళ్లి ప్రయోగాలపై శిక్షణ ఇవ్వాలని హెచ్‌ఎంలకు సెలవిచ్చి మిన్నకుండిపోవడం అధికారుల వంతైంది. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థినులు 5కిలోమీటర్లు వెళ్లిరావడం ప్రయాసతో కూడుకున్న వ్యవహారం కావడంతో కొంతమంది హెచ్‌ఎంలు మాత్రమే తూతూమంత్రంగా ఒకట్రెండుసార్లు ప్రయోగాలపై శిక్షణ తరగతులు నిర్వహించారని సమాచారం. దీనిపై డీఈవో డాక్టర్ వి.శేఖర్‌ను అడగ్గా హైస్కూల్‌ప్లస్‌లలో సీనియర్ సైన్స్ విద్యార్థినులకు ప్రయోగ శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామని చెప్పారు. ల్యాబులున్న స్కూల్స్‌లో అక్కడే ప్రాక్టికల్స్ జరిపిస్తున్నామని, మిగిలిన వారికి సమీపంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రయోగ శిక్షణ నిర్వహించే ఏర్పాట్లు చేశామన్నారు.

జిల్లాలో ఇదీ పరిస్థితి

తిరుపతి జిల్లాలోని 34మండలాలకు సంబంధించి 25హైస్కూళ్లలో ఇంటర్‌విద్యను అందించేందుకు హైస్కూల్ ప్లస్‌గా అప్‌గ్రేడ్ చేశారు. పాఠశాలవిద్యలో భాగంగా జిల్లా విద్యాశాఖ పర్యవేక్షణలో ఇవి నడుస్తున్నాయి. వీటిలో సీనియర్ ఇంటర్ సైన్స్ కోర్సులకు సంబంధించి ఎంపీసీ గ్రూపులో 79మంది, బైపీసీలో 162మంది విద్యార్థినుల చొప్పున మొత్తం 241మంది చదువుతున్నారు. తొలిఏడాదిలో హైస్కూల్‌ప్లస్‌లలో ఎంపీసీగ్రూపులో ఒక విద్యార్థిని కూడా చేరలేదు.ఎనిమిది స్కూళ్లలో మాత్రమే 79మంది చేరారు. బైపీసీలో 17స్కూళ్లలో విద్యార్థినులు చేరలేదు. 8స్కూళ్లలో 162మంది చేరారు. రెండు సంవత్సరాలూ కలిపి ఈ ఏడాదిలో సీఈసీ, ఎంపీసీ, బైపీసీ గ్రూపులలో చదువుతున్న మొత్తం విద్యార్థినులు 768మంది ఉన్నట్లు సమాచారం. ఇక గతేడాదిలో ప్రథమ ఇంటర్‌లో సాధించిన ఉత్తీర్ణతశాతం కూడా అంతంతమాత్రంగానే ఉంది. మొత్తంగా 25హైస్కూల్‌ప్లస్‌లలో 18.5శాతంమంది విద్యార్థినులు మాత్రమే పాసవ్వడం గమనార్హం. దీంతో హైస్కూల్ ప్లస్‌లలో ఇంటర్ అడ్మిషన్లను పెంచేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో పదవతరగతి పూర్తిచేసిన విద్యార్థినులను బలవంతంగా చేర్పించారు. హెచ్‌ఎంలపై ఒత్తిడి పెంచడంతో పదవతరగతి పూర్తిచేసిన విద్యార్థినులకు టీసీలు ఇవ్వకుండా అక్కడే ప్రవేశాలు కల్పించాల్సి వచ్చింది. ఇంత ఒత్తిడి చేసి చేర్పుకున్న విద్యార్థినులకు అవసరమైన సదుపాయాలు, నాణ్యమైన విద్యను అందించడంలో మాత్రం ప్రభుత్వం చొరవచూపకపోవడం విమర్శలకు దారితీస్తోంది.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

దళితులను దగా చేస్తున్న వైసీపీ: నెలవల



చీరలు పంపిణీ చేస్తున్న నెలవల సుబ్రహ్మణ్యం తదితరులు

నాయుడుపేట టౌన్, జనవరి 24: రాష్ట్రంలో దళితులను వైసీపీ దగా చేస్తున్నదని సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. బుధవారం పట్టణంలోని ఏటుగట్టు కాలనీవాసులకు తెలుగు మహిళా జిల్లా ఉపాధ్యక్షురాళ్లు సుజాతమ్మ, సుగుణమ్మ ఆధ్వర్యంలో చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నెలవల మాట్లాడుతూ నగిరి నియోజకవర్గంలో మంత్రి రోజా ఓ దళిత కౌన్సిలర్‌కు మున్సిపల్ ఛైర్‌పర్సన్ పదవి ఇప్పిస్తామని చెప్పి రూ.70 లక్షలు డిమాండ్ చేయడం, రూ.40 లక్షలు తీసుకుని మోసం చేయడం దుర్మార్గమన్నారు. ముఖ్యమంత్రి జగన్ కూడా ఎమ్మెల్యే టిక్కెట్ల కేటాయింపులో దళితులను మోసం చేస్తున్నారని, రానున్న ఎన్నికల్లో వైసీపీకి దళితులే తగిన గుణపాఠం చెబుతారని నెలవల అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు అశోక్‌రెడ్డి, రాజేంద్ర, దార్ల రాజేంద్ర, అవధానం సుధీర్, ముత్యాలయ్య, వెంకటేశ్వర్లు, లక్ష్మయ్య పాల్గొన్నారు.

దేశభక్తిని పెంపొందించాలి



జాతీయ జెండాతో తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

గూడూరు, జనవరి 24: స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు అర్పించిన మహనీయుల గురించి నేటితరం విద్యార్థులకు తెలియజెప్పి వారిలో దేశభక్తిని పెంపొందించాలని రైల్వేస్టేషన్ మేనేజర్ వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం ఏబీవీపీ సేవాభారతి ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక రైల్వేస్టేషన్ నుంచి 75 అడుగుల జాతీయ జెండాతో విద్యార్థులు పట్టణంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతోమంది మహనీయులు తమ ప్రాణాలను త్యాగం చేసి స్వాతంత్ర్యాన్ని అందించారన్నారు. ఆర్ఎస్ఎస్ నాయకుడు మల్లికార్జున మాట్లాడుతూ ప్రతిఒక్కరూ దేశభక్తిని కలిగివుండాలన్నారు. కార్యక్రమంలో రూపవతి, నిఖిత, చిన్నా, శివశంకర్, వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళలు మరోసారి మోసపోరు: టీడీపీ

సూళ్లూరుపేట, జనవరి 24: జగన్ మాయమాటలు నమ్మి అధికారం అప్పగించిన మహిళలు మరోసారి మోసపోయేందుకు సిద్ధంగా టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. బుధవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తుండడంతో సీఎం జగన్‌కు అక్కా చెల్లెళ్లమ్మలు గుర్తుకొచ్చారని, అందుకే ఆసరా నిధులు జమ చేశారని అన్నారు. చంద్రబాబు నాయుడు తొలిసారి ముఖ్యమంత్రి అయినప్పుడే మహిళా సాధికారిత కోసం అనేక కార్యక్రమాలు ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. పొదుపు గ్రూపులను ప్రారంభించిందెవరో వైసీపీ ప్రభుత్వం గుర్తు చేసుకోవాలన్నారు. టీడీపీ హయాంలో మహిళలు అన్ని రంగాల్లో రాణించారన్నారు. వైసీపీ పాలనకు చమరగీతం పాడేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని, ఎన్నికలు ఎప్పుడు జరిగినా టీడీపీ ప్రభంజనం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, చిట్టేటి పెరుమాల్, బుద్ధి విజయలక్ష్మి, మంజుల, శ్రీనివాసుల నాయుడు, నాపా మునిరాజా, మాధవనాయుడు, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమిస్తాం



తహసీల్దారు పద్మావతికి వినతిపత్రం ఇస్తున్న బీటీఏ నాయకులు

కోట, జనవరి 24: ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించకుంటే ఉద్యమాలకు ఊపిరిపోస్తామని బహుజన టీచర్స్ అసోసియేషన్(బీటీఏ) నాయకులు హెచ్చరించారు. బుధవారం వారు ఎంఈవో మస్తానయ్య, ఎంపీడీవో భవానీ, తహసీల్దారు పద్మావతికి బీటీఏ నాయకులు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా బీటీఏ నాయకులు మాట్లాడుతూ అపరిష్కృతంగా ఉన్న సర్వీస్, ఆర్థిక, విద్యా సంబంధిత సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వానికి లిఖితపూర్వకంగా విన్నవించుకున్నా పట్టించుకోలేదన్నారు. మొదటి దశ నిరసనలో భాగంగా సీపీఎస్, జీపీఎస్ రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించడంతో పాటు 11 పీఆర్సీ, డీఏ అరియర్స్ రూ.7382 కోట్లు వెంటనే చెల్లించాలన్న డిమాండ్లను ప్రభుత్వం ముందు ఉంచామన్నారు. ఆ సమస్యలను ఇప్పటికీ పరిష్కరించలేదని ఆవేదనవ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీటీఏ మండల అధ్యక్షుడు పేర్నాటి నాగరాజు, ప్రధాన కార్యదర్శి మట్టిగుంట శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, శేఖర్, రమణయ్య, సుబ్బారావు, నాగరాజు, ఏడుకొండలు పాల్గొన్నారు.

ప్రజలకు సంపూర్ణ వైద్యసేవలు అందించాలి

నాయుడుపేట, జనవరి 24: అర్బన్ హెల్త్ కేర్ సెంటర్లకు వచ్చే ప్రజలకు సంపూర్ణ ఆరోగ్య వైద్యసేవలు అందించాలని ఆస్పత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మన్ కొండూరు రామకృష్ణంరాజు అన్నారు. నాయుడుపేటలోని శ్రీకాళహస్తి పాత బైపాస్ రోడ్డులోని అర్బన్ హెల్త్ కేర్ సెంటర్‌ను బుధవారం పరిశీలించారు. అక్కడ ఉన్న మందులు, వైద్య పరికరాలను పరిశీలించి సిబ్బందితో మాట్లాడారు. మందులు, వైద్య పరికరాలు కావాల్సిఉంటే తమ దృష్టికి తీసుకువస్తే అధికారుతలతో మాట్లాడి సరఫరా అయ్యేలా చూస్తామని చెప్పారు.

నేడు తిరుమలలో పుష్యమాస పౌర్ణమి గరుడసేవ

తిరుమల, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): పుష్యమాస పౌర్ణమి సందర్భంగా తిరుమలలో గురువారం రాత్రి గరుడసేవ నిర్వహించనున్నారు. ప్రతినెలా పౌర్ణమి రోజున టీటీడీ గరుడసేవ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. రాత్రి 7 నుంచి 9గంటల వరకు మలయప్పస్వామి తన ఇష్టవాహనమైన గరుడునిపై కొలువుదీరి భక్తులకు దర్శనమివ్వనున్నారు.

రామకృష్ణతీర్థ ముక్కోటి

తిరుమలలో గురువారం రామకృష్ణతీర్థ ముక్కోటి నిర్వహించనున్నారు. తిరుమలకు ఆరు మైళ్ల దూరంలో ఉన్న ఈ తీర్థంలో ముక్కోటిని పుష్యమి నక్షత్రంతో కూడిన పౌర్ణమిరోజున శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు. స్కంద పురాణం ప్రకారం పూర్వకాలంలో రామకృష్ణుడు అనే మహర్షి వేంకటాద్రిపై తపస్సు చేసి, స్నానమాచరించడానికి ఈ తీర్థాన్ని రూపొందించు కున్నారు. ఇందులో స్నానమాచరించడం వల్ల అజ్ఞానంతో తల్లిదండ్రులు, గురువులను దూషించడం వల్ల కలిగే దోషాల నుంచి విముక్తి లభించి, సుఖంగా జీవిస్తారని ప్రాశస్త్యం. గురువారం ఉదయం నుంచి భక్తులను తీర్థానికి అనుమతించనున్నారు. ఆరోగ్య సమస్యలు ఉన్న వారికి అనుమతి లేదని టీటీడీ స్పష్టం చేసింది. కాగా గోగర్భం డ్యామ్ పాయింట్ నుంచి పాపవినాశనం వరకు యాత్రికులను తరలించేందుకు ఆర్టీసీ దాదాపు 35 బస్సులను ఏర్పాటు చేసింది. భక్తుల సౌకర్యార్థం టీటీడీ అన్నప్రసాద విభాగం ఆధ్వర్యంలో పాలు, కాఫీ, పొంగళి, ఉప్మా, సాంబారన్నం, పెరుగన్నం పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టింది.

బైక్ కాల్చివేతపై ఫిర్యాదు

నాయుడుపేట టౌన్, జనవరి 24: పట్టణంలోని పాతబస్టాండ్ సమీపంలో నివాసం ఉంటున్న చరణ్ తన బైక్‌ను గుర్తుతెలియని వ్యక్తులు కాల్చివేశారని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. మంగళవారం రాత్రి ఇంటి ముందు పార్క్ చేసిన బుధవారం ఉదయం లేచిచూసే కాలిపోయి ఉందని ఫిర్యాదులో పేర్కొన్నాడు.

ఎస్ఈబీ సీఐగా శ్రీనివాసులు



వాకాడు, జనవరి 24: వాకాడు ఎస్ఈబీ సీఐగా డి.శ్రీనివాసులు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో బాపట్లలో పనిచేస్తున్న ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఆయనకు ఎస్ఈబీ సిబ్బంది అభినందనలు తెలిపారు.

రోజాను మంత్రి పదవి నుంచి తొలగించాలి

మాజీ ఎమ్మెల్యే సునీల్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

గూడూరు, జనవరి 24: మున్సిపల్ ఛైర్‌పర్సన్ పదవి ఇప్పిస్తానని డబ్బులు తీసుకుని దళిత మహిళను మోసం చేసిన రోజాను మంత్రి పదవి నుంచి తొలగించాలని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. బుధవారం గూడూరు పట్టనంలోని టీడీపీ కార్యాలయంలో నిర్వహించి సమావేశంలో ఆయన మాట్లాడుతూ పుత్తూరు పురపాలక సంఘం ఎన్నికల్లో కౌన్సిలర్‌గా గెలిచిన భువనేశ్వరిని ఛైర్‌పర్సన్ చేస్తానని ఆమె నుంచి మంత్రి రోజా రూ.70లక్షలు డిమాండ్ చేయడం దుర్మార్గమన్నారు. దళిత మహిళ అయిన భువనేశ్వరి రూ.40లక్షలు ఇచ్చినా ఛైర్స్‌పర్సన్ పదవి ఇవ్వకపోగా, ఇచ్చిన డబ్బులను ఆమెకు తిరిగి ఇవ్వకుండా బెదిరింపులకు పాల్పడడం మంచిపద్ధతి కాదన్నారు. ఈ వ్యవహారంపై దర్యాప్తు జరిపించి మంత్రిపై చర్యలు తీసుకోవడంతో పాటు బాధితురాలికి న్యాయం చేయాలన్నారు. వైసీపీలో మొత్తం అవినీతిపరులు, రౌడీలు, స్మగ్లర్లే ఉన్నారని ఆరోపించారు. వైసీపీ పాలనంతా అరాచకమేనని, రాష్ట్రంలో ఎక్కడ చూసినా దౌర్జన్యాలు, దాడులు, దోపిడీ తప్ప అభివృద్ధి జాడే కనిపించడంలేదని విమర్శించారు. ఇక సంక్షేమ పేరుతో సీఎం జగన్ జనాన్ని దోచుకుంటున్నారని అన్నారు. వైఎస్సార్ ఆసరా ఓ పెద్ద టోకరా పథకం అని ఎద్దేవా చేశారు. గత టీడీపీ ప్రభుత్వంతో 1.24కోట్ల మంది డ్వాక్రా మహిళలకు ఒక్కొక్కరికీ రూ.20వేలు ఇవ్వడం జరిగిందన్నారు. వైసీపీ ప్రభుత్వం కేవలం 74లక్ష మందికి మాత్రమే ఒక్కొక్కరికీ రూ.15వేలు ఇస్తూ ఆర్భాటంగా ప్రచారం చేసుకుంటోందని దుయ్యబట్టారు. రానున్న ఎన్నికల్లో ప్రజలందరూ వైసీపీని చిత్తుగా ఓడించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గోను శివకుమార్, కోటేశ్వరరావు, గురవయ్య, చిరంజీవి, మల్లికార్జున, సురేంద్ర, సునీల్, సందీప్, నాగార్జున, వెంకటసాయి, భారతి, శైలజ, సుప్రజ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి



హెల్త్ కార్డులను అందజేస్తున్న నరేంద్రరెడ్డి, సర్పంచు శివకుమార్

పెళ్లకూరు, జనవరి 24: కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎద్దల నరేంద్రరెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని జీలపాటూరు, చిల్లకూరు, రోసనూరు, సీఎన్‌పేట గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్పయాత్ర నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి, వికసిత్ భారత్ సంకల్ప యాత్ర రాష్ట్ర కోఆర్డినేటర్ సూరిపాకల మునిసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. అనంతరం ఉజ్వల పథకం కింది గ్యాస్ కనెక్షన్లతో పాటు, ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచు కందమూడి శివకుమార్, ఎంపీడీవో సురేష్ బాబు, ఐసీడీఎస్ సీడీపీవో ఉమామహేశ్వరి, ఏవో గొడవర్తి ప్రవీణ, బీజేపీ మండల అధ్యక్షుడు గోగుతొట్టి మురళి, నాయకులు బిరదవాడ మునిచంద్ర, పంచాయతీ కార్యదర్శి సమ్మన శ్రీహరి, హౌసింగ్ ఏఈ వెంకయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

తనయుడి కోసం తల్లి బుజ్జగింపులు



ఎంపీపీ భాస్కర్‌రెడ్డితో మాట్లాడుతున్న నేదురుమల్లి రాజ్యలక్ష్మి

బాలాయపల్లి, జనవరి 24: వెంకటగిరి నియోజకవర్గ అధికార పార్టీలో అసమ్మతి నేతలను బుజ్జగించేందుకు మాజీ మంత్రి నేదురుమల్లి రాజ్యలక్ష్మి చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా బాలాయపల్లి ఎంపీపీ గూడూరు భాస్కర్‌రెడ్డి, ఏఎంసీ ఛైర్మన్ సింగంశెట్టి భాస్కర్‌రావు ఇళ్లకు బుధవారం వెళ్లారు. వెంకటగిరి నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జిగా నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి బాధ్యతలు చేపట్టాక బాలాయపల్లి మండలంలో పెత్తనం సాగిస్తున్న ఎంపీపీ గూడూరు భాస్కర్‌రెడ్డి, ఏఎంసీ ఛైర్మన్ సింగంశెట్టి భాస్కర్‌రావును పక్కనబెట్టి వెందోటి కార్తీక్‌రెడ్డికి ప్రాధాన్యం ఇస్తున్నారు. అప్పటి నుంచి ఎంపీపీతో పాటు ఏఎంసీ ఛైర్మన్ పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. ఈ నేథప్యంలో బుధవారం నేదురుమల్లి రాజ్యలక్ష్మి జయంపు, పిగిలాం గ్రామాలకు వెళ్లి ఎంపీపీ గూడూరు భాస్కర్‌రెడ్డి, ఏఎంసీ ఛైర్మన్ సింగంశెట్టి భాస్కర్‌రావుతో మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో తన కుమారుడు రాంకుమార్ రెడ్డి గెలుపునకు కృషి చేయాలని కోరినట్లు తెలిసింది.

విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీపీ ప్రకృతి కుమార్

సూళ్లూరుపేట, జనవరి 24: విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కేజే ప్రకృతి కుమార్ అన్నారు. బుధవారం స్థానిక బాలికల గురుకులంలో జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా చట్టాలపై అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ట్రైనీ డీఎస్పీ సింధుపూజ మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదల, క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు.

క్రీడాకారుల్లో ప్రతిభను వెలికితీసేందుకే పోటీలు



క్రికెట్ ఆడుతున్న విద్యార్థులు

గూడూరు, జనవరి 24: గ్రామీణ క్రీడాకారుల్లో ప్రతిభను వెలికితీసేందుకే ప్రభుత్వం ఆడుదాం... ఆంధ్రా పోటీలను నిర్వహిస్తోందని ఎంపీడీవో వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం స్థానిక ఏఏరెడ్డి ప్రభుత్వ స్టేడియంలో నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 29వ తేదీ వరకు ఈ పోటీలు జరుగుతాయన్నారు. గెలుపొందిన జట్లు జిల్లా స్థాయికి ఎంపిక అవుతాయన్నారు. కార్యక్రమంలో శివకుమార్, గోపినాధ్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు దుస్తుల పంపిణీ



గూడూరు, జనవరి 24: స్థానిక బాలాజీనగర్‌లోని ప్రగతిసేవా సంస్థ కార్యాలయంలో బుధవారం పేదలకు దుస్తులు, ఆహార పొట్లాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కడివేటి చంద్రశేఖర్, శ్రీనివాసులు, ప్రభాకర్, రాము, కుమార్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు...

వెంకటగిరి టౌన్, జనవరి 24: మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు, మున్సిపల్ సిబ్బందికి మాజీ మంత్రి నేదురుమల్లి రాజ్యలక్ష్మమ్మ బుధవారం దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం ఆమె కార్మికులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

రేపు రక్తదాన శిబిరం

నాయుడుపేట, జనవరి 24: రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని శ్రీవేమ విద్యాసంస్థల అధినేత తంబిరెడ్డి మనోహర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం తమ సంస్థల ఆధ్వర్యంలో రక్తదానం శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. యువత రక్తదానం చేయాలని కోరారు.

ట్యాబ్‌ల పంపిణీ



విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేస్తున్న ఉపసర్పంచు విజయసారథిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి కిరణ్‌కుమార్

కోట, జనవరి 24: మండల పరిధిలోని గూడలి ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు బుధవారం ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ప్రభుత్వం పరఫరా చేసిన ట్యాబ్‌లను హెచ్ఎం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఉపసర్పంచు పల్లెమల్లు విజయసారధిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి కిరణ్‌కుమార్ చేతులమీదుగా విద్యార్థులకు అందజేశారు. ట్యాబ్‌ల వినియోగంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, స్థానికులు పాల్గొన్నారు.

అభివృద్ధి ప్రణాళికలపై శిక్షణ



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీవో భవానీ

కోట, జనవరి 24: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం అభివృద్ధి ప్రణాళికలపై పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని 21 పంచాయతీల సర్పంచులు, కార్యదర్శులు, 16 సచివాలయాల్లోని డిజిటల్ అసిస్టెంట్లకు శిక్షణ ఇచ్చారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి పంచాయతీల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలు, నిధుల వినియోగంపై అవగాహన కల్పించారు.

టీడీపీ నాయకుడి నివాళి

దొరవారిసత్రం, జనవరి 24: దొరవారిసత్రం మండలం వేణుంబాక గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు కొమ్మల శంకర్ ఇటీవల మృతి చెందాడు. బుధవారం సంతాప సభ నిర్వహించారు. శంకర్ చిత్రపటానికి మాజీ మంత్రి పరసా వెంకటరత్నం, సూళ్లూరుపేట నియోజవర్గ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, మండల అధ్యక్షుడు శ్రీనివాసులునాయుడు, నాయకులు రవీంద్ర నాయుడు, సతీష్‌చంద్ర, షబ్బీర్, సుభాన్, జకరయ్య, మురళిరెడ్డి, సురేష్‌రెడ్డి తదితరులు నివాళులర్పించారు. చెన్నై ఇజ్రాయిల్ సేవా సంస్థ సౌజన్యంతో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు.

పర్యావరణ సహిత పొయ్యిల పంపిణీ

గూడూరు, జనవరి 24: మండలంలోని పాలిచెర్ల గ్రామంలో బుధవారం ఐసీఐసీఐ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పర్యావరణ సహిత పొయ్యిలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రతినిధి శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పొయ్యిల నుంచి వచ్చే కాలుష్యాన్ని తగ్గించేందుకు పర్యావరణ సహిత పొయ్యిలను అందజేశామన్నారు. కార్యక్రమంలో విజయభాస్కర్‌రెడ్డి, మస్తానమ్మ, గోపాల్, మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.



పర్యావరణ సహిత పొయ్యిలను అందజేస్తున్న ఐసీఐసీఐ ఫౌండేషన్ సభ్యులు

లారీ ఢీకొని మోటారు సైక్లిస్టు మృతి

నాయుడుపేట టౌన్, జనవరి 24: నాయుడుపేట - అయ్యప్పరెడ్డిపాళెం స్వర్ణముఖినది బ్రిడ్జి సమీపంలో మోటారు సైకిల్‌ను లారీ ఢీకొన్న ఘటనలో మదన్‌మోహన్ నాయుడు(45)మృతి చెందాడు. నెల్లూరులో ఓ కంపెనీలో మెడికల్ రెప్రజెంటేటివ్‌గా పనిచేస్తున్న మదన్‌మోహన్ నాయుడు బుధవారం మోటారు సైకిల్‌పై నాయుడుపేటకు వెళ్తుండగా స్వర్ణముఖినది బ్రిడ్జి సమీపంలో లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో మదన్‌మోహన్ నాయుడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులో చిన్నారి మృతదేహం



చిన్నారి మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ హరికృష్ణ

చిట్టమూరు, జనవరి 24: మండల కేంద్రమైన చిట్టమూరు చెరువులో బుధవారం సాయంత్రం గుర్తు తెలియని ఐదేళ్ల చిన్నారి మృతదేహం లభ్యమైంది. చిట్టమూరు గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు చెరువులో చిన్నారి మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ లక్ష్మీభవాని సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటకు తీయించారు. వాకాడు సీఐ హరికృష్ణ చిన్నారి మృతదేహాన్ని పరిశీలించారు. నల్లటి గీతల టీ షర్టు, నిక్కరు ధరించి ఉంది. ముఖం కనిపించకుండా టవల్ చుట్టివుంది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ప్రతి రైతూ ఈక్రాప్ నమోదు చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచు శ్రీనివాసన్

తడ, జనవరి 24: తడ మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ కొలవి రఘురెడ్డి అధ్యక్షతన బుధవారం జరిగింది. వ్యవసాయశాఖ ఏవో కాంచన మాట్లాడుతూ మండలంలో సుమారు 6,800 ఎకరాల్లో వరి, 135 ఎకరాల్లో వేరుశనగ పంటలను రైతులు సాగు చేశారన్నారు. రామాపురం సర్పంచు శ్రీనివాసన్ అడిగిన వివరాలకు ఏవో సమాధానమిస్తూ ప్రతి రైతూ తప్పనిసరిగా ఈక్రాప్‌లో నమోదు చేసుకోవాలన్నారు. ఎంపీడీవో ఆమోస్‌బాబు మాట్లాడుతూ ఏడుగురు వెటర్నటీ అసిస్టెంట్లు నాలుగు నెలలుగా విధులకు గైర్హాజరు అవుతున్నారని, వారిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని చెప్పారు. తహసీల్దారు జయజయరావు మాట్లాడుతూ ఏడు గ్రామాల్లో రీసర్వే పూర్తయిందని, ఈ నెలాఖరులోగా ఇరకం, వేనాడు గ్రామాల్లో రీసర్వే పూర్తి చేస్తామని తెలిపారు. సమావేశంలో డీసీఎంఎస్ డైరెక్టర్ గండవరం సురేష్‌రెడ్డి, వైస్ ఎంపీపీ వెంకటేష్, రమేష్, హౌసింగ్, విద్యుత్ ఏఈలు సత్యనారాయణ, మురళి, ఎంఈవో మల్లికార్జున, డాక్టర్లు కిషోర్, మస్తానయ్య, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లపై శిక్షణ



శిక్షణ కార్యక్రమంలో సబ్ రిజిస్ట్రార్ ప్రవీణాదేవి

కోట, జనవరి 24: కోటలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో బుధవారం సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ల ప్రక్రియపై శిక్షణ కార్యక్రమం జరిగింది. స్థానిక సబ్ రిజిస్ట్రార్ ప్రవీణాదేవి కోట, వాకాడు, చిట్టమూరు, చిల్లకూరు మండలాల పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, డిజిటల్ అసిస్టెంట్లకు శిక్షణ ఇచ్చారు. త్వరలో సచివాలయాల ద్వారా రిజిస్ట్రేషన్ల ప్రక్రియ చేపట్టనున్న నేపథ్యంలో సిబ్బందికి ప్రయోగాత్మకంగా శిక్షణ ఇచ్చారు.

జువ్వలపాళెంలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర

నాయుడుపేట, జనవరి 24: నాయుడుపేట - జువ్వలపాళెంలో బుధవారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు విజయభాస్కర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కొప్పోలు సుబ్రహ్మణ్యం, రవి, వైసీపీ నాయకులు ఎస్. ప్రవీణ్‌రెడ్డి, రఘురామరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.44 కోట్లు

తిరుమల, జనవరి 24(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.44 కోట్లు లభించింది. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ మంగళవారం లెక్కించి బుధవారం ఉదయం ప్రకటించింది.

30న వాహనాల వేలం

తిరుపతి (రవాణా), జనవరి 24: తిరుపతి, శ్రీకాళహస్తి ఆర్టీసీ డిపోల్లో ఉన్న వాహనాలను ఈనెల 30వ తేదీ ఉదయం 11గంటలకు వేలం వేయనున్నామని, పాల్గొనదలచినవారు ధరావత్తు రూ.5వేలు నగదు రూపంలో చెల్లించాల్సి ఉంటుందని జిల్లా ఇన్‌చార్జి రవాణాశాఖ అధికారి ఆదినారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళం డిపోలో 3 మ్యాక్సీక్యాబ్‌లు, ఒక ఐచర్, ఒక మహీంద్ర, టాటా గూడ్స్ వాహనాలు, శ్రీకాళహస్తి డిపోలో 2 మహీంద్ర ఆటోలు, 1 బజాజ్ ఆటో, 1 మహీంద్ర మ్యాక్సీక్యాబ్, 1 మోటారు క్యాబ్ ఉన్నాయని తెలిపారు.